అమావాస్య రాత్రి

బొమ్మిడి అచ్చారావు

"ఈ రెండు రోజులుగా మీ అన్నయ్య ఎక్కడున్నారో తెలీదు. కాస్త వాళ్ళ ఆఫీసుకి వెళ్ళి కనుక్కో కేశవా!" అన్నది రాధ.

కేశవ్ వదినగారివైపు చూడకుండానే, "ఏదైనా ఆఫీస్ పనిమీద వెళ్ళాడేమో వదినా! అప్పుడప్పుడు యిలా వెళ్ళటం అన్నయ్యకలవాటే కదా!" అన్నాడు.

రాధ అతనిలా తేలిగ్గా తీసుకోలేదా విషయాన్ని. "నాకు చెప్పకుండా కాంప్ వెళ్ళరు. కనీసం ఆఫీస్ అటెండర్‌తోనైనా కబురు చేస్తారు. గుడ్డలు తీసుకు వెళ్తారు. కాంప్ కాదని ఖచ్చితంగా చెప్పగలను" అన్నది.

కేశవ్ ఓ రెండు క్షణాలేదో ఆలోచించుకుని "సరే, వాళ్ళ ఆఫీసుకి వెళ్ళి వస్తాను. నువ్వనవసరంగా వర్రీ కావద్దు వదినా!" అన్నాడు.

ఓ గంట తర్వాత తిరిగొచ్చి, "అన్నయ్య రెండు రోజులుగా ఆఫీస్‌కి రావటం లేదని చెప్పారండినా

అన్నయ్య కొలీగ్స్!" అన్నాడు కేశవ్.

రాధ ప్రమాన్పడిపోయింది. కొద్దిక్షణాలవరకు తేరుకోలేకపోయింది.

"ఏమిటి కేశవా....అయితే, రెండు రోజుల్నుంచి ఆయన ఎక్కడికి వెళ్ళినట్లు?"

"అదే నాకూ అర్థం కావటంలేదు వదినా! వాళ్ళు చెప్పిన వెంటనే పరుగెత్తుకొచ్చాను. అన్నయ్య యేనాడూ యిలా చేయలేదు. నిన్న ఉదయం ఆఫీస్ కి బయల్దేరిన వ్యక్తి ఆఫీస్ కి కూడా వెళ్ళకుండా యెక్కడికి వెళ్ళాడో, యీ రోజు వరకు యింకా ఎందుకు రాలేదో అంతుబట్టకుండా వున్నది" అన్నాడు కేశవ్.

రాధ విచారవదనంతో, "ఆయన స్నేహితుల్ని ఎంక్వయిరీ చెయ్యకపోయావా? అసలు నిన్నట్నుంచీ నిన్ను వెళ్ళి రమ్మంటుంటే వెళ్ళావే కాదు!" నిష్ఠూరం, బాధ కలగలిపిన గొంతుతో అన్నది.

"అనుకోని కేంప్ మీద వెళ్ళివుంటాడనుకున్నాను. అందుకే యిప్పటిదాకా యెదురుచూశాను. నువ్వు భయపడటం మానీ వెళ్లా నాఫీసుకి. నీ అనుమానమే నిజమయింది. అన్నయ్య నిన్న ఆఫీస్ కసలు వెళ్ళనేలేదంటే, ఏదో బలమైన కారణముండి వుండాలి."

"అంత బలమైన కారణమేమిటో తెలుసుకోవద్దా?.. కొంపదీసి యేదయినా ఏక్సిడెంట్" రాధ గొంతు వణికింది దుఃఖంతో.

"అబ్బెబ్బె...అలాంటిదేం లేదు వదినా! ఈ మూడు నాలుగురోజులుగా సిటీలో ఏక్సిడెంట్ ఏమీ జరగలేదు. అలాంటిదేమైనా వుంటే లోకల్ పేపర్లో వెంటనే వచ్చేస్తూంది. పైగా నిన్న ఉదయమనగా వెళ్ళా

డన్నయ్యా!..” ఓదార్పుగా అన్నాడేగాని మనసులో ఏదో అనుమానం పీకుతోంది కేశవ్ కి.

వారం రోజులుగా తన అన్న జయరాం యేదో మానసికమైన అశాంతికి లోనైనట్టు కేశవ్ గమనించాడు. కాని అన్నను ఆ విషయమై ఏమీ అడగలేదు. కుటుంబ సమస్యలో, మరేదైనా ఆఫీసు వ్యవహారమో అతన్ని సతమత పెడుతూ వుండొచ్చునని, ఆ విషయానికంత ప్రాధాన్యత నివ్వలేదు కేశవ్.

ఇప్పుడు అన్నయ్య అంతర్ధానానికి, ఆ మానసిక అల జడికి యేదైనా సంబంధమున్నదా అని ఆలోచించాడు.

వదిన బాగా కంగారుపడిపోతోంది ఆమెకు అన్నయ్యంటే గొప్ప ప్రేమ, ఆరాధన, అంతకుమించిన గౌరవాభిమానాలు వుండటంవల్ల అతనికి తలనొప్పి వచ్చినా, తనకు పెద్ద జబ్బు చేసినట్టు హడావిడి చేసేస్తుంది. అంతా చిన్నపిల్లల మనస్తత్వం. అన్నయ్యకు ఒక్కడే కొడుకు. ఆరేళ్ళ కుమార్ కాన్వెంట్ లో చదువుకొంటున్నాడు. ఆ తర్వాత ఆమెకు సంతానంలేదు. అందుకనేనేమో అన్నయ్యపట్ల మరీ ప్రేమాభిమానాలు యెక్కువయిపోయాయి.

“అన్నయ్య స్నేహితుడొకాయన నాకు బాగా తెలుసు వదినా! ఆయన్ని కనుక్కొని వస్తాను” అని బయల్దేరాడు కేశవ్.

రాబోతున్న కన్నీటిని బలవంతాన అదిమిపెట్టి తలూపింది రాధ.

కేశవ్ చెప్పిన స్నేహితుడు కరుణాకర్. అతను వెళ్ళేసరికి బయటకు యెక్కడికో వెళ్ళటానికి తయారవుతున్నాడు.

కేశవ్ ని చూసి పలకరింపుగా నవ్వి, "ఏమోయ్, రా, రా! మీ అన్నయ్య గురించి యేమయినా తెలిసిందా?" అనడిగాడు.

కేశవ్ అంతక్రితం ఆఫీసుకి వచ్చి జయరాం గురించి అడిగినప్పుడు కరుణాకర్ కూడా వున్నాడక్కడ. ఆఫీసు క్లోజింగ్ అవర్లో వెళ్ళాడు కేశవ్. అప్పుడు కరుణాకర్ ని వివరాలు అడగలేదు. కబురందజెయ్యాలనే హడావిడిలో వదిన దగ్గరకు పరుగెత్తుకొచ్చాడు.

"ఆ విషయమే మిమ్మల్నడగటానికొచ్చానండి. అన్నయ్యకి మీరు క్లోజ్ ఫ్రెండ్ కదా! మీకైతే పూర్తి వివరాలు తెలుస్తాయని వచ్చాను. వదిన బాగా ఆందోళన పడిపోతోంది. అసలు అన్నయ్య మీతో యేమైనా చెప్పాడా?"

"ఏమీ చెప్పలేదు. అదే ఆశ్చర్యంగా వుంది. మొన్న అంటే సోమవారం సాయంత్రం ఆరుగంటలు దాటే వరకు ఆఫీసులోనే వున్నాం మేమిద్దరం. మీ అన్నయ్య మామూలుగానే ప్రవర్తించాడు. నాతో సాధారణంగా అన్ని విషయాలు చర్చిస్తాడు. ఏదయినా ప్రత్యేకమయిన సమస్య వుంటే చెప్పి వుండేవాడు."

"నిన్న ఉదయం పదిగంటలకు మామూలుగానే బయల్దేరాడండి ఆఫీసుకు. మరి యింతలోనే ఏమయిపోయాడంటారు?"

"నిన్న ఆఫీసుకి మాత్రం రాలేదు. ఖచ్చితంగా చెప్పగలను. ఎందుకో సెలవు పెట్టి వుంటాడనుకున్నాం. కాని ఈ రోజు కూడా రాకపోయేసరికి మా మేనేజర్ని అడిగాను. సెలవు పెట్టలేదని తెలిసింది. సాయంత్రం మీ యింటికొద్దామనుకుంటుండగా ఆఫీసుకి నువ్వే వచ్చావు."

కేశవ్ అయోమయంగా చూశాడు కరుణాకర్ వంక. "అయితే, అన్నయ్య ఆచూకీ తెలుసుకునే అవకాశమే లేదంటారా?" అన్నాడు.

"అదే ఆలోచిస్తున్నాను. ఒకలాగా అయ్యే అవకాశముంది...." అన్నాడు కరుణాకర్ సాలోచనగా.

కేశవ్ ఆశగా చూశాడతనివంక.

"మరేంలేదు. మీ అన్నయ్య సిద్ధుణ్ని కల్సుకోవటానికిగాని వెళ్లాడేమోననుకుంటున్నాను" అన్నాడు కరుణాకర్.

కేశవ్ విస్తుపోయి, "సిద్ధుడా? అతనెవరు?" అన్నాడు.

"పరిస్థితి ఇంతవరకు వచ్చాక నీకు చెప్పకపోవటం భావ్యంకాదు. మీ అన్నయ్యకి మధ్య డబ్బు మీద వ్యామోహం పెరిగిపోయింది. కష్టపడనవసరంలేకుండా తేలిగ్గా డబ్బు చేసుకోవటంమీద దృష్టి కేంద్రీకరించాడు. అందుకు నిత్యానందస్వామి అనే సిద్ధుడే కారణం!" అన్నాడు కరుణాకర్.

"ఎవరా నిత్యానందస్వామి? అభ్యంతరం లేకపోతే వివరాలు చెప్పండి" అన్నాడు కేశవ్.

2

జయరాంకి వచ్చే ఆదాయం తక్కువ. ఖర్చులు ఎక్కువ. అది అతను చేసుకున్న ఖరీదైన అలవాట్లవల్ల పెరిగాయి.

ఆదాయాన్ని ఖర్చుకి తగ్గట్టు పెంచుకోవాలనే తపనలో అతనికి ఎవరో సలహా ఇచ్చారు, రాగిని బంగారంగా మార్చే ప్రక్రియ తెలిసిన వ్యక్తి రాజవొమ్మంగి అడవుల్లో వున్నాడని, అతను రాగిని బంగారంగా

మార్కెట్ మూలికలు గురించి బాగా తెలిసినవాడనీ.

జయరాం వెంటనే రాజమహేంద్రవరం వెళ్లాడు.

అది బాగా అడవి ప్రాంతం. అయితే యీ మధ్యనే నాగరికత ఆ అడవి పొలిమేరల్లోకి ప్రవేశించి, గిరిజన కోపరేటివ్ స్టోర్స్ పెట్టుకునే వరకు వచ్చింది. అంతక్రితం ఏజెన్సీ సరుకులన్నీ గిరిజనులు గోకవరం సంతలో అమ్ము కుంటుండేవారు. ఇప్పటికీ సగానికి పైగా అటవీ సంపద గోకవరంలో అమ్మకానికొస్తూంటుంది. దళారులు కొని మారు బేరాలకి అమ్ముతుంటారు.

జయరాం తనకి వివరాలు చెప్పిన గిరిజన వ్యక్తిని తన వెంట రాజమహేంద్రవరం తీసుకువెళ్లాడు. అడవి ప్రాంత మంతా ఆ వ్యక్తి చాలా సేపు తిప్పాడు జయ రాంని. చివరికి బాగా కీకారణ్యంలో వున్న జనసంచారం లేని ఓ చీకటి కోనం దగ్గరకు తీసుకువెళ్ళాడు. అక్కడ వరసగా అయిదారు కొండగుహాలున్నాయి.

ఓ కొండ గుహమాత్రం మనుషులు సంచరిస్తూన్న సూచనలతో కనిపించింది. ఆ వ్యక్తి జయరాంని ఆ కొండ గుహాలోపలికి తీసుకువెళ్ళాడు.

అంతదాకా యెంతో ధైర్యంగా వచ్చిన జయరాంకి ఆ నిర్జన కీకారణ్యం, భయంకరమైన నిశ్శబ్దం, మారు మూల చీకటి గుహాలు చూశాక ధైర్యం సడలిపోవటం మొదలయింది. వెనక్కి తిరిగి వెళ్ళిపోవాలని మనసులో చాలాసార్లు అనుకున్నాడు. కాని, బంగారంమీది ఆశ అతన్ని ముందుకే నెట్టింది.

గుహాలోపల అతి తక్కువ కాంతిలో ఓ చమురుదీపం వెలుగుతోంది. ఆ వెలుగులో ఓ ఎత్తయిన బండరాతిమీద పులిచర్మం ఆసనంగా కూచుని వున్న ఓ ముదుసలి కనిపిం

చాడు జయరాంకి.

అతని గడ్డం, మీసాలు, జుట్టు మగ్గుబుట్టలా తెల్లగా వున్నాయి. కళ్ళు మూసుకుని ధ్యానముద్రలో వున్నట్టుగా వున్నాడతను.

జయరాం, అతన్ని తీసుకొచ్చిన గిరిజన యువకుడు ఆ వ్యక్తి కళ్ళు తెరిచేవరకు అక్కడే మౌనంగా నిల్చుని వుండిపోయారు. పదినిమిషాల తర్వాత అతను కళ్ళు తెరిచి, యెదురుగా వినయంగా నించుని వున్న గిరిజన యువకుణ్ని జయరాంని చూశాడు.

"ఎవరు నాయనా నువ్వు?" అనడిగాడు.

గిరిజన యువకుడు మోకరిల్లి, "అయ్యోర్యా, తమ దరిసినాని కొచ్చిండు దొర. సేనే తోల్కొని వొచ్చిన" అన్నాడు.

"కూచో నాయనా! ఏమిటి నువ్వొచ్చిన పని?" అనడిగాడు ముసలాయన.

"స్వామీ, తమరు సిద్ధపురుషులని, నిత్యానంద స్వాములని యీ యువకుడివల్ల తెలుసుకున్నాను. తమరు బంగారాన్ని రాగినుంచి సృష్టిస్తారని, అందుకు కొన్ని వన మూలికల్ని ఉపయోగిస్తారని వాటి విషయం మీకు తప్ప మరెవ్వరికీ తెలియదనీ యీ కుర్రవాడు చెప్పగా విని తమ దర్శనార్థం వచ్చాను. నేను అతికపరమైన యిబ్బందుల్లో వున్నాను. తమరు అనుగ్రహిస్తే నా యిబ్బందు లన్నీ తీరిపోతాయి" అన్నాడు జయరాం వినయంగా.

నిత్యానందస్వామిగా పరిచయమైన ఆ సిద్ధుడు మంద హాసం చేస్తూ, పొడవాటి గడ్డాన్ని నిమురుకుంటూ, "ఎందుకు నాయనా, నీకీ ఆరాటం? ఉన్నదాంతో తృప్తి పడలేవా?" అన్నాడు.

"నాకొచ్చే జీతం యే మూలకు సరిపోవటంలేదు స్వామీ! అందుకే తమ దగ్గరకు వచ్చాను. నేను డబ్బు సమస్యల్లోపడి కొట్టుకుంటున్నాను. నన్ను వారించకండి స్వామీ!"

"అయితే, ఆ వనమూలికలు ఎక్కడ దొరుకుతాయో, వాటినెలా ఉపయోగించాలో అన్నీ వివరంగా చెపుతాను. అమావాస్య రోజున తప్ప అవి కంటికి కనిపించవు. నువ్వు వచ్చే చతుర్దశి రోజున ఓసారి వచ్చి కనిపించు. అమావాస్య రోజున జరగవలసిన తంతు కొంత వున్నది. ఆ వివరాలు చతుర్దశిరోజున చెపుతాను."

జయరాంకి ఆనందంతో వెంటనే నోటమాటరాలేదు. "అలాగే స్వామీ! ఈరోజు ద్వాదశి. ఎల్లుండే కదా చతుర్దశి. తప్పక తమ దర్శనం చేసుకుంటాను" అన్నాడు.

"చతుర్దశి రోజున పగటిపూట మాత్రమే రా! ఈ రోజు ఆదివారం. మంచిరోజున నన్ను వచ్చి కలిశావు. మంగళవారం చతుర్దశిరోజు. అదికూడా మంచిరోజు. వెళ్ళిరా!" అన్నాడు సిద్ధుడు.

"మహాప్రసాదం స్వామీ! ఆజ్ఞ యిప్పించండి."

"వెళ్ళిరా, నాయనా!" అన్నాడు సిద్ధుడు.

జయరాం, తనకి గైడ్‌లా వ్యవహరించిన ఆ గిరిజన యువకుడి సహాయంతో అడవినుంచి బయటికొచ్చాడు.

3

కరుణాకర్ చెప్పింది సంభ్రమాశ్చర్యాలతో విన్నాడు కేశవ్.

"అయితే...నిన్న మంగళవారం, తిథి చతుర్దశి ఏమో శాస్త్ర కేలండర్ చూసి చెప్పండి" అన్నాడు.

అతనిలో ఆత్రుత అధికమయ్యింది. బంగారం

మోజులోపడి అన్నయ్య ఏదో క్రూరవలయంలో చిక్కుకున్నాడనిపిస్తోందతనికి.

కరుణాకర్ కేలండర్ చూసి "కరెక్టే! ఈ రోజు అమావాస్య. అందుకనే మీ అన్నయ్య వెళ్ళివుంటాడు, అనుమానంలేదు. ఆదివారం రాజవొమ్మంగి వెళ్ళివచ్చాడు. సోమవారం నాకు ఆఫీసులో యీ సంగతి చెప్పాడు. నేను కొట్టిపారేశాను. 'అదంతా ఉత్తది, ఎవడో నిన్ను వెర్రిబాగులవాడ్ని చేసి ఆడిస్తున్నాడు. రాగిలో బంగారం చేయుట మేమిటి? నీకీ మూఢనమ్మకాలెలా వంటబట్టాయి?' అని కేకలేశాను.

మీ అన్నయ్య తన పట్టు వదల్లేదు. అలాంటి పిచ్చి ఆలోచనల్తో మనసు పాడుచేసుకోకు అంటూ హెచ్చరించాను. సోమవారం ఆరుగంటలవరకు మా మధ్య ఇదే చర్చనీయాంశమయింది. నిన్న ఉదయం నించే కదా జయరాం కనపడటంలేదు!? ఖచ్చితంగా రాజవొమ్మంగి వెళ్ళివుంటాడు" అన్నాడు.

కేశవ్‌లో ఉద్వేగం, అసహనం చోటుచేసుకున్నాయి "అయితే, యిప్పుడెలా? అన్నయ్యకేదైనా ఆపద సంభవిస్తే....?" అన్నాడు భయంగా.

"అదే, నేనూ ఆలోచిస్తున్నాను....సరే, ఓ పని చేద్దాం. మనం వెంటనే రాజవొమ్మంగి వెళ్దాం. అక్కడ మీ అన్నయ్య ఆచూకీ తెలియవచ్చు. అమావాస్య యీ రోజే కదా! అక్కడ ఏదో తంతువుందన్నాడు. మరి అదెలాంటి తంతో? కనీసం, ఆఫీసుకి సెలవుకూడా పెట్టకుండా వెళ్ళిపోయాడంటే, ఉద్యోగంపట్లకూడా అతనికి శ్రద్ధపోయింది. బంగారం వచ్చిపడుతుంటే, జీతం రాళ్ళతో పనేమిటనుకుని వుంటాడు.

నువ్వు మీ యింటి దగ్గరే వుండు. ఓ అరగంటలో నేనొస్తాను. ఎనిమిది గంటలకి రాజవొమ్మంగిపోయే బస్ వుంది. ఇప్పుడు ఏడుగంటలవుతోందికదా, దొరుకుతుంది” అన్నాడు కరుణాకర్.

కేశవ్ ఇల్లు చేరేసరికి రాధ ఆత్రుతగా అతనికోసమే నిరీక్షిస్తూ గడపలోనే నించుంది.

“బాబూ, కేశవా, మీ అన్నయ్య ఏం చేశారో తెలుసా?” అన్నది ఉద్వేగంతో కూడిన దుఃఖంతో.

“ఏం చేశాడు వదినా?” కేశవ్ గుండె దడదడా కొట్టుకోసాగింది.

“మధ్యాహ్నం మన కుమార్ కాన్వెంటుకి వెళ్ళి కుమార్ని తీసుకొని వెళ్ళారట. అంత అర్జంటుగా యెక్కడికి వెళ్ళారో, మళ్ళీ అంత అర్జంటుగానూ వచ్చి కుమార్ని తీసుకుని యెక్కడికి తీసుకెళ్ళిపోయారో నాకేమీ అర్థంకావటంలేదు. ఇంటిక్కూడా రాకుండా ఆయనిలా ఎందుకు ప్రవర్తిస్తున్నారో నాకేమీ బోధపడటంలేదు. జ్వరం వచ్చినట్టుగా వుంది. ఏమిటో అయిపోతున్నట్టు ఏదో జరగకూడనిది జరిగిపోతున్నట్టు నా మనసు కీడు శంకిస్తోంది” ఆమె తూలిపడిపోబోయి అంతలోనే నిలదొక్కుకున్నది.

“వదినా, అప్ సెట్ కావొద్దు. అలా కూచో. అసలేం జరిగిందో చెప్పు! అన్నయ్య కుమార్ కాన్వెంటుకి వెళ్ళటమేమిటి, కుమార్ని తీసుకెళ్ళటమేమిటి? ఎవరు చెప్పారీ విషయం?”

“ఎవరో కాదు, కుమార్ క్లాస్ టీచరే! స్కూల్ అయిపోయాక ఆమె కుమార్ని వాళ్ళింటికి తీసుకుపోయి ప్రతి సాయంత్రం ట్యూషన్ చెప్తుందికదా! ఈ రోజు

కూడా అలాగే కుమార్ ని తీసుకువెళ్ళి వుంటుంది, కుమార్‌తో వస్తూందని యెదురు చూస్తున్నాను. నువ్వు మీ అన్నయ్య ఫ్రెండ్ దగ్గరకు వెళ్ళిన వెంటనే ఆ టీచర్ ఒక్కతే వచ్చింది. కుమార్ ఏడని అడిగాను.

ఆమె నిర్ఘాంతపోయి,

"మధ్యాహ్నం వాళ్ళ డాడీ వచ్చి తీసుకువెళ్ళారు కదండీ! పుస్తకాలు క్లాసులోనే వుండిపోయాయి, ఇచ్చి పోదామని వచ్చాను. కుమార్‌ని వాళ్ళ నాన్నగారింకా యింటికి తీసుకురాలేదా?" అనడిగింది. నా గుండెలు చల్లబడిపోయాయి. ఆమెకేదో సమాధానం చెప్పి పంపేసి నీకోసం ఎదురుచూస్తున్నాను" అన్నది రాధ ఆయాసపడుతూ.

కేశవ్ నిర్ఘాంతపోయాడు.

అన్నయ్య నిన్న ఉదయం అడవికి వెళ్ళి యీ రోజు మళ్ళీ యిక్కడకు వచ్చాడు. కుమార్‌ని ఎందుకు తీసుకు వెళ్ళినట్టు? మాటమాత్రంగానైనా వదినతోగాని, తనతో గాని అసలు సంగతి ఎందుకు చెప్పలేదు? ఊళ్ళోకి వచ్చి కూడా యింటికెందుకు రాలేదు, అసలు కుమార్‌ని ఎక్కడకు తీసుకువెళ్ళాడు?

అన్నీ ప్రశ్నలే! సమాధానాలు ఊహించటాని క్కూడా భయంగా వుంది కేశవ్‌కి.

సరిగ్గా అప్పుడే కరుణాకర్ తయారై వచ్చాడు. కేశవ్ చెప్పింది విని, చేష్టలుడిగినట్టు నిల్చుండిపోయాడు.

కొద్దిక్షణాల తర్వాత తేరుకొని, "కేశవ్, వెంటనే రాజవొమ్మంగి వెళ్ళాలి. మీ అన్నయ్య కుమార్‌ని అక్కడికే తీసుకువెళ్ళి వుంటాడు" అన్నాడు కరుణాకర్.

రాధ అయోమయంగా చూసింది వాళ్ళిద్దరి వంక. కరుణాకర్ వంక చూసి, "ఏమిటి మీరు చెప్తున్నది? రాజవొమ్మంగి యేమిటి, కుమార్‌ని అక్కడికి తీసుకు వెళ్ళట మేమిటి? దయచేసి వివరంగా చెప్పండి. నా గుండె ఆగిపోయేలా వుంది. ఒకేసారి తండ్రీ కొడుకు లిద్దరూ మాయమయ్యారు. తట్టుకోలేకపోతున్నాను" అన్నది జాలిగా.

"వదినా, ధైర్యం తెచ్చుకో! నేను కరుణాకర్‌గారు అన్నయ్యను వెతకటానికి వెళ్తున్నాం. నేను బహుశా రాత్రికి రాను. ఒకటి రెండు రోజులు పట్టినా పట్టొచ్చు తిరిగి రావటానికి. నువ్వేం కంగారుపడొద్దు అన్నయ్యను తీసుకొని వస్తాను. కుమార్, అన్నయ్య క్షేమంగా తిరి గొస్తారు. నువ్వు భోంచేసి నిద్రపో! తలుపులు జాగ్రత్తగా వేసుకో!" అంటూ ధైర్యం చెప్పాడు రాధకి.

"భోంచేసి వెళ్ళు" అన్నది గొంతు పెకల్చుకుని ఎలాగో.

"బస్ వెళ్ళిపోతుంది. వెళ్తున్నాం" అంటూ హడా విడిగా కరుణాకర్‌తో బయల్దేరాడు కేశవ్.

4

"వచ్చావా, నాయనా? ఇలా కూచో! ఈ రోజు చతుర్దశి మంగళవారం. నీ సంకల్పానికి దృఢత్వం కలి గించే రోజు. ఈ రోజెందుకు రమ్మన్నానో తెలుసా?" అడిగాడు సిద్ధుడు జయరాం వంక నవ్వుతూ చూసి.

"చెప్పండి స్వామీ!" అన్నాడు వినమ్రంగా.

"చూడు నాయనా, యీ బంగారం సృష్టికి చాలా వ్యయప్రయాసలకి ఓర్చాలి. చాలా శ్రమతో కూడిన సాధన చెయ్యాలి. నీకు సమ్మతమేనా?"

"సమ్మతమే స్వామీ సెలవివ్వండి."

"అన్నట్టు అడగటం మరిచాను. నువ్వు సంతానవంతుడివే కదా! నిస్సంతుడివి కాదు గదా!"

"సంతానవంతుడ్నే స్వామీ! ఆరేళ్ళకొడుకున్నాడు."

"భేష్! నీ తపస్సుకు పరిపూర్ణత్వం కలగాలంటే నీ వెంట నీ కొడుకుకూడా వుండాలి."

"నా కొడుకా? అంతటి పసిపిల్లడు వాడు యీ అడవిలోకి ఎలా రాగలడు? ఎలా వుండగలడు?"

"నువ్వు తీసుకురా. నీ కొడుకు నీ వెంట వుండటానికి అభ్యంతరమేముంటుంది? సాధన పూర్తికాగానే మూలికలతో బాటు స్వర్ణసాధనా శక్తితో ఆనందంగా వెళ్ళిపోవచ్చును కదా యిరువురు కలిసి."

"అవుననుకోండి. మరి ఇప్పుడెలా తీసుకురావటం?"

"సాధన ప్రారంభించేది రేపు అమావాస్యరోజున కదా! నువ్వు తిరిగి వెళ్ళి రేపు సాయంత్రానికి నీ కొడుకును వెంటబెట్టుకుని రా. రేపు సూర్యాస్తమయం తర్వాత యిక్కడికిరా. రేపు రాత్రి క్రతువు ప్రారంభమవుతుంది."

జయరాం అయోమయావస్థలోనే అంగీకార సూచకంగా తలాడించాడు.

"ఈ రాత్రికి ఎక్కడైనా విశ్రమించు. నీ ఇంటికి వెళ్ళకూడదు. ఇదిగో మంత్రించిన విభూతి నీ నొసట పెడుతున్నాను. ఈ క్షణం నుంచీ నువ్వు దీక్షాబద్ధుడివై వుండాలి! ఏమాత్రం పొరపాటు జరిగినా మంత్రం బెడిసి కొడుతుంది. ఇష్టమే కదా!"

"ఇష్టమే స్వామీ! కాని నా కొడుకుని తేవటం గురించే ఆలోచిస్తున్నాను. నా యింటికి వెళ్ళకూడ

దంటున్నారు. ఎవరితోను చెప్పకూడదంటున్నారు....”

“అదేమంత కష్టమైన పని? నీ బిడ్డ పాఠశాలలో చదువుకుంటున్నాడంటివి కదా! రేపు ఉదయం బయల్దేరి సరాసరి పాఠశాలనించి నీ కుమారుడ్ని వెంటబెట్టుకొని తిరిగి యిక్కడికి సూర్యాస్తమయం జరిగేటప్పటికి తీసుకు రాలేవా?”

“తీసుకు రాగలను స్వామీ!”

“మంచిది. వెళ్ళిరా నాయనా! ఈ విషయం నీ కత్యంత ఆప్తులైన వాళ్ళకు కూడా తెలియకూడదు. నువ్వు యీ క్రతువు మొదలుపెట్టావు. మధ్యలో వెనుకంజ వేస్తే అంతా అరిష్టమే, గుర్తుంచుకో!”

“అలాగే స్వామీ! ఈ రాత్రికి యిక్కడెక్కడో గడిపి రేపు బయలుదేరి మా వూరు వెళ్తాను. మీరు చెప్పినట్టే రేపు సాయంత్రం సూర్యాస్తమయ మయినాక నా బిడ్డతో యిక్కడికి వస్తాను.”

“మంచిది. వెళ్ళిరా!” అన్నాడు సిద్ధుడు.

మర్నాడు—

కుమార్‌ని తీసుకొని వచ్చాడు జయరాం.

“రా, నాయనా! వీడు నీ బిడ్డా? ఆహా, అచ్చు నీ పోలికల్నే పుణికిపుచ్చుకున్నాడు. రా బిడ్డా, నువ్వు కూడా యీ దర్భాసనంమీద కూచో” అన్నాడు సిద్ధుడు నవ్వుతూ, తండ్రి వెనకగా భయంగా ఒదిగి వున్న కుమార్‌ని చూసి.

“భయం లేదు కుమార్! స్వామివారికి సాష్టాంగ నమస్కారం చెయ్యి” అన్నాడు జయరాం.

కుమార్ భయం భయంగా సిద్ధుడివంక చూస్తూ నమస్కారం చేశాడు.

అప్పుడు రాత్రి యేడుగంటలుదాటి యిరవై నిమిషాలయింది.

సిద్ధుడు జయరాం వైపు దయగా చూస్తూ, "నీ బిడ్డను తీసుకొస్తున్నట్టు యెవరితోను చెప్పలేదు కదూ!...." అన్నాడు.

"లేదు స్వామీ! అసలు నేనెవర్నీ కలుసుకోలేదు, పెదవి విప్పి మాట్లాడలేదు. మీరు చెప్పిన విధంగా నే దీక్ష వహించి మా బాబును తీసుకు వచ్చాను. ఏం చెయ్యాల్లో ఆజ్ఞాపించండి!" అన్నాడు జయరాం.

"చెప్తాను. రాత్రి సరిగ్గా పన్నెండు గంటలకు దీక్షలో కూచోవాలి! అందుకు కావలసిన రంగం సిద్ధం చేస్తాను. ఈ లోపల మీ యిద్దరు యేదో యింత తిని యీ గుహలో విశ్రమించండి" అన్నాడు సిద్ధుడు.

"అలాగే స్వామీ! తమ ఆజ్ఞ!" అన్నాడు జయరాం.

కుమార్ కి యిదంతా చాలా వింతగా, భయంగా అనిపిస్తోంది. యేదో యెప్పుడూ చూడని కొత్త వాతావరణం, భీభత్సంగా వున్న గుహ, దెయ్యాల్లా చుట్టూ చెట్లు, గుట్టలు, పుట్టలు గుండెల్లో గుబులు పుట్టిస్తూంటే, తండ్రి నంటిపెట్టుకుని వుండిపోయాడు.

జయరాం మనసునిండా బంగారమూ దాన్ని గురించిన ఆలోచనలే ముసురుకుంటున్నాయి. తన చిరకాల వాంఛితం నెరవేరబోతున్నందుకు ఆనందంతో తల మునకలవుతున్నాడు.

5

బస్ వేగంగా పోతోంది.

ఇద్దర్లో యెవరూ మాట్లాడటంలేదు, కేశవ్ మన

సంతా టెన్షన్‌తోను, భయంతోను నిండిపోయింది. అన్నయ్య అత్యాశకుపోయి ఏం పీకమీదకు తెచ్చుకున్నాడోనని అతని ఆలోచనంతా.

కరుణాకర్ ఆలోచనలుకూడా జయరాం చుట్టూనే తిరుగుతున్నాయి. ఎందుకు జయరాం యిలా దిగజారిపోయాడు? పైగా కొడుకును కూడా తనతో తీసుకుపోవలసిన పనేమి వచ్చింది? అతన్ని అంతగా ప్రేరేపించిన ఆ సిద్ధు డెవరు? గుప్త పుణ్యానికి జయరాంకి ఎందుకా స్వర్ణ విద్య నేర్పటాని కంగీకరించాడు? తలవిదిలించాడు.

బస్ బయల్దేరి అరగంట దాటింది. సామర్లకోట, పెద్దాపురంల మధ్యన వున్నది. మరో రెండు గంటల ప్రయాణం వున్నది.

సమయం రాత్రి ఎనిమిదిన్నర గంటలు.

కరుణాకర్, కేశవ్ పక్కపక్కనే కూచునివున్నారు. ఇద్దరు కూచునే సీటు అది!

ఎక్కువసేపు అలా మౌనంగా వుండలేకపోయాడు కేశవ్.

"అన్నయ్యకు అసలు యీ ప్రేరణ పుట్టించిందెవరో మీకు తెలుసా?" అన్నాడు కేశవ్.

"ఎవరో కొండజాతి వాడు. అతనెలా కలిశాడో, జయరాం యెలా లొంగిపోయాడో నాకర్థం కాదు. వివరాలు పూర్తిగా చెప్పలేదు."

"ఇదంతా ప్లాన్ మీద జరిగిందేమోనని అనుమానంగా వుంది."

"కావచ్చు. జయరాం బలహీనతని తమ స్వార్థానికి వాడుకోవటానికి యెవరో కావాలని బంగారం ఆశ పెట్టి వుండొచ్చు. అంటే మీ అన్నయ్య గురించి, అతని అవ

సరాల గురించి బాగా తెలిసిన వాళ్ళకే అది సాధ్యపడు తుంది."

"అలాంటి వాళ్ళెవరు? అన్నయ్యకి మీరు అత్యంత సన్నిహితులు కదా! మీకు తెలిసి వుంటుందని అడుగు తున్నాను, అన్యధా భావించకండి."

"ఫరవాలేదు. ఇందులో అపార్థాలకు తావులేదు. అన్ని కోణాల నుంచీ ఆలోచించాలి. ఆఫీస్‌లో మీ అన్నయ్యంటే పడనివాళ్ళు ఒకరిద్దరు లేకపోలేదు. మీ అన్నయ్య అడ్డు లేకపోతే ప్రమోషన్ వాళ్ళకే వస్తుంది. కాని వాళ్ళు యింత ప్లాన్ వేసి వుంటారా అనే ఆలో చిస్తున్నాను."

"ఎందుకవ్వారు? అన్నయ్యని అడ్డు తొలగించుకుంటే వాళ్ళకే కదా ప్రమోషన్ వచ్చేది! స్వార్థం యింత పనయినా చేయిస్తుంది."

"అఫ్‌కోర్స్! ఆ విషయం కనిపెట్టడం పెద్ద కష్టం కాదనుకో. కాకినాడ తిరిగొచ్చాక ఆ విషయం మళ్ళీ ఆలోచిద్దాం."

వాళ్ళ మాటల మధ్య బస్ రాజవొమ్మంగి చేరింది.

రాత్రి పదకొండు గంటలయింది బస్ దిగేసరికి.

అమావాస్య చీకట్లు అంతటా పరుచుకుని వున్నాయి. బస్ స్టాండులో అక్కడక్కడ తక్కువ కేండిల్ బల్బులు చీకటిని పారదోలలేక పోతున్నాయి. అదే చివరి బస్ కావటంతో బస్టాండులోని పళ్ళ దుకాణాలు, సోడాబడ్డీలు కట్టేశారు. అంతా నిర్మానుష్యంగా వుంది.

దూరంగా ఫారెస్టు ఠాణా దగ్గర మాత్రం ప్రకాశ వంతంగా వెలుగుతున్నాయి దీపాలు.

"ఎక్కడికి వెళ్దాం?" అన్నాడు కేశవ్ చీకటినీ,

భయంకరమైన నిశ్శబ్దాన్ని చూసి.

“ఇక్కడికి రెండు ఫర్లాంగుల దూరంనుంచి అడవి మొదలవుతుంది. నేనెప్పుడూ యిక్కడికి రాలేదు. రూమర్లో తెలిసినవాళ్ళు చెప్పుకోవటం తప్పితే యిక్కడి విషయాలు నాకేమాత్రం తెలియవు. ఎవర్నైనా అడుగుదాం.”

“అందరూ దాదాపు నిద్రావస్థలో వుండే సమయం. మనకి యిన్ఫర్మేషన్ యిచ్చేవాళ్ళెవరుంటారు?”

“అలా నిరాశపడొద్దు. లోకల్ గా ఉండేవాళ్ళని ఎవర్నడిగినా చెప్పకపోరు. అయితే ఆ సిద్ధుడి గురించి డైరెక్టుగా అడక్కూడదు. ఫారెస్టు లోపలికి దారి తెల్సుకుంటే అక్కడ్నుంచి మన పాట్లు మనం పడదాం. నా వెంట నాలుగు సెల్స్ టార్చిలైటు, అవసరమైతే ప్రాణరక్షణార్థం రెండు కత్తులు, తాడు, సిగరెట్ లైటర్ వంటి పరికరాలు తెచ్చాను” అన్నాడు కరుణాకర్. అతని భుజానికి పెద్ద ఏర్ బ్యాగ్ వేలాడుతోంది.

కేశవ్ సిగ్గుపడ్డాడు, తను ఆమాత్రంకూడా సిద్ధపడి రానందుకు. మనసు చికాకుగా వున్నపుడు అన్ సెటిల్డుగా వున్నపుడు మరే విషయంమీదకు దృష్టిపోదు. తనిప్పుడు అదే స్థితిలో వున్నాడు.

“మనతో బాటు బస్ లో దిగాడు చూడు. ఆయన బాగా చదువుకున్నవాడిలా వున్నాడు. ఏ టీచరో, లేక యిక్కడి ఆఫీసుల్లో ఎక్కడైనా పనిచేస్తున్న ఉద్యోగో అయ్యుండొచ్చు. త్వరగా నడు. ఆయన్ని కల్సుకుని వివరాలు సేకరిద్దాం” దూరంగా నడిచి వెళ్తున్న ఓ నడివయసు వ్యక్తిని చూపిస్తూ అన్నాడు కరుణాకర్.

ఐదు నిమిషాల్లో ఆయన్ని కల్సుకున్నారిద్దరూ.

కరుణాకర్ అడిగినదానికి ఆ వ్యక్తి ఆశ్చర్యపోయి, "ఏమిటి, అడవిలోకి దారా? ఈ టైంలోనా? అంత అవసర మేమి వచ్చింది?" అన్నాడు యిద్దరివంక సాలోచనగా చూస్తూ.

కరుణాకర్ యేం చెప్పాలా అని క్షణం తడుముకుని, "మేము హెల్తు డిపార్టుమెంటునించి వస్తున్నాం. ఇక్కడ మలేరియా జ్వరాలతో తీవ్రంగా బాధపడుతున్న గిరిజనులకు రాడికల్ ట్రీట్‌మెంట్ యివ్వటానికొచ్చాం. మీకు తెలిసె వుంటుంది, యిక్కడ మలేరియా జ్వరాలు అధికంగా వున్నాయనీ, అది అంటువ్యాధి అనీను. ఒక్కో రోజు అలస్యమయ్యే కొద్దీ కొన్ని వందల మందికి అది దోమకాటు ద్వారా వ్యాపిస్తుంది. అందుకే ఈ రాత్రికి రాత్రి కొందరికైనా ట్రీట్‌మెంటివ్వాలని బయల్దేరి వచ్చాం."

ఆ వ్యక్తి చేయిచాచి వారితో కరచాలనం చేసి, "చాలా సంతోషం. మిమ్మల్ని కల్సుకోవటం ఆనందదాయకం. బైదిబై, నా పేరు పశుపతి. ఇక్కడ వెటర్నరీ డాక్టర్‌గా పనిచేస్తున్నాను. నావల్ల మీకేం సహాయం కావాలి?" అన్నాడు కరుణాకర్ భుజానున్న బేగ్ వంక చూస్తూ.

"మిమ్మల్ని కల్సుకోగలిగినందుకు చాలా సంతోషంగా వున్నది" అన్నాడు కరుణాకర్.

"దయచేసి ఫారెస్టు లోపలకు దారి చూపించండి. మా ట్రీట్‌మెంటు ప్రారంభిస్తాం."

"ఈ రాత్రి సమయంలో యేం అవస్థపడతారు? నేను మా వెటర్నరీ హాస్పిటల్లో మీకు యీ రాత్రికి వసతి యేర్పాటు చేస్తాను. రెస్టు తీసుకొని, రేపు తెల్లా

ర్తూనే మీ పని ప్రారంభించవచ్చు" అన్నాడు పశుపతి.

కరుణాకర్ వెంటనే, "అన్యధా భావించకండి. మలేరియా భయంకరమైన అంటుజ్వరం. అతి తొందరగా వ్యాపించే వ్యాధి. అందుకని పాజిటివ్ కేసుల్ని అర్జంటుగా ట్రీట్ చెయ్యాలి. అందుకే మా తొందర" అన్నాడు.

"అలాగే! మీ యిష్టం. ఈ చీకట్లో కొత్తచోటు అందునా అడవిలో మీరేం అవస్థలు పడతారోనని నా భయం.... ఇదిగో, ఆ లైట్లు కనిపిస్తున్నాయి చూశారా, అదే ఫారెస్టు ఠాణా. అక్కడ ఫారెస్టర్, ఠాణేదార్ గార్డు వగైరా సిబ్బందికి క్వార్టర్సుంటాయి. అవి దాటుకుని లోపలకు వెళ్తే కోయగూడేలుంటాయి. మీ దగ్గర పేర్లుంటాయేమో కదా!"

"ఆ, ఆఁ! వున్నాయి. పాజిటివ్ కేసుల పేర్లన్నీ లిస్టు రాసుకున్నాం."

"మంచిది. కాని, ఒక్క విషయం మీకు చెప్పాల్సి వుంటుంది జాగ్రత్తగా వినండి...." అన్నాడు పశుపతి లోగొంతుతో.

కరుణాకర్, కేశవ్ అతనివంక ఆసక్తిగా చూశారు.

"ఆ క్వార్టర్సుకి కుడివైపు దాదాపు రెండు మైళ్ళు పోతే, జనసంచారంలేని కొండ గుహలున్నాయి. అటు వైపు మాత్రం పొరపాటునకూడా పోవద్దు."

"ఎందుకలా అంటున్నారు?" అడిగాడు కేశవ్.

"అక్కడెవరో సిద్ధుడున్నాడని జనం చెప్తుకుంటారు. అతను యేదో అతీంద్రియ శక్తుల్ని సంపాదించటానికి నరబలులు యిస్తూంటాడని ప్రతీతి. అయితే ప్రత్యక్షంగా చూసిన వాళ్ళెవరూ లేరనుకోండి. కాని నిప్పులేనిదే

పోగరాదుగా!" అన్నాడు పశుపతి.

తమకు కావలసిన విషయాన్ని అతను ప్రస్తావించటం ఇద్దరికీ చాలా ఆనందం కలిగించింది. మరి కొన్ని వివరాలు అతన్నుంచి సేకరించారు.

పశుపతి చెప్పిన కథనం ప్రకారం అక్కడ చాన్నాళ్ళుగా ఓ వృద్ధుడు ఓ కొండగుహలో నివాసమేర్పరచుకుని వుంటున్నాడు. ఎప్పుడూ ధ్యానసమాధిలో వుండే ఆ వృద్ధుడు కొండజాతి వాళ్ళకు ఆరాధ్యనీయుడు.

అతన్ని అందరు సాములోరు అని పిల్చుకుంటారు. అయ్యోర్యా అంటూ పడిపడి మొక్కుతారు. కొండజాతి క్షేమంకోసం, వాళ్ళ ఉన్నతికోసం మాత్రమే తను నిత్యం తపస్సమాధిలో వుంటున్నట్టు చెపుతుంటాడు. దాంతో అమాయక కొండ ప్రజ అతనికి బ్రహ్మరథం పడుతున్నారు.

అయితే అక్కడ ఉద్యోగాలు చేసుకుంటున్న వారి కుటుంబ సభ్యులు కొందరు అప్పుడప్పుడు మాయం కావటంతో వాళ్ళందరు ఆందోళన చెంది నిఘా వేయగా ఆ సిద్ధుడు వాళ్ళని మాయం చేస్తున్నాడని తెలిసింది. అయితే ప్రత్యక్షంగా చూసినవాళ్ళు లేరు.

మాయమైన వాళ్ళు అందరు మగపిల్లలే కావటం, పది సంవత్సరాలలోపు వయసువాళ్ళు కావటం అందర్నీ ఆశ్చర్యపరచింది. దాన్నిబట్టి ఆ సిద్ధుడే వాళ్ళ నెత్తుకుపోయి బలిచ్చి వుండొచ్చునని అనుమానించారు.

అయితే సిద్ధుడ్ని ప్రశ్నించటానికిగాని అతణ్ని కలుసుకోవటానికిగాని యెవరికీ అనుమతి యివ్వబడదు. పైగా కొండజాతి మనుషులు అనునిత్యం అక్కడ మసలుతుంటారు. సిద్ధుడిమీద ఈగ కూడా వాలనివ్వకుండా చూసు

కుంటారు.

అందుకే ఎవరూ అతన్ని కల్సుకోవటానికిగాని, నేరం మోపడానికిగాని ధైర్యం చెయ్యలేదు. తమకు జరిగిన అన్యాయానికి కుమిలిపోయి అక్కడ్నుంచి బదిలీలు చేయించుకుని వెళ్ళిపోయారు."

"ఇంత జరిగినా పోలీసులుగాని, నాయకులుగాని యెవరూ పట్టించుకోలేదా?" అనడిగాడు కరుణాకర్.

కేశవ్ కి ఆ పాటికే జరగబోతున్న ఘోరం కళ్ళకు కట్టినట్టు కనిపించి నవనాడులు కృంగిపోయాయి. అన్నయ్య కుమార్ నెందుకు అర్జంటుగా తీసుకొచ్చాడో అర్థమై పోయింది.

బంగారం పిచ్చిలో పడి సిద్ధుడి మాయలో చిక్కుకు పోయి అతని చేతిలో కీలుబొమ్మయిపోయాడు. అందుకే అతని ఆజ్ఞలను శిరసావహించి. కట్టుకున్న భార్యకూడా చెప్పకుండా కన్నకొడుకును తీసుకుపోయి సిద్ధుడి కప్పగించేశాడు.

అయితే అతనికి సిద్ధుడి పన్నాగం తెలిసి వుండదు. తెలిసి తెలిసి ఏ కన్నతండ్రీ కొడుకును బలిచేసుకోవటానికి సిద్ధపడడు. డబ్బుకోసం ఒక్కగానొక్క కొడుకు ప్రాణం చేజేతులా తీసుకోడు. అన్నయ్యని మభ్యపెట్టి కుమార్ ని రప్పించాడు.

ఇప్పుడు పశుపతి చెప్పిన మాటలతో తన అనుమానం పూర్తిగా బలపడింది. ఖచ్చితంగా బలివ్వటానికే కుమార్ ని రప్పించాడు సిద్ధుడు.

కరుణాకర్ ప్రశ్నకు పశుపతి తల అడ్డంగా తిప్పి, "పోలీసులకూడా సిద్ధుడి దరిదాపులకు పోవటానికి ధైర్యంలేదు. నాయకులు కూడా యిక్కడెవరున్నారు?

కోయగూడెం నాయకులే కదా! వాళ్ళు సిద్ధుడికి దాసానుదాసులు. పెదవి మెదపరు.

ఈ రోజు మిమ్మల్ని యెందుకు వారిస్తున్నానో తెలుసా? ప్రతి అమావాస్య రోజున అర్ధరాత్రి ఆ కొండ గుహల పరిసరాల్లో ఖచ్చితంగా యేదో నరబలి జరుగుతూనే వుంటుందని తెలిసినవాళ్ళు చెపుతారు. ఇప్పుడు సమయం అర్ధరాత్రి దగ్గరపడుతోంది. ఈ సమయంలో అడవిలోపలికి పోవాలని యెవరూ అనుకోరు. చివరికి ఫారెస్టు డిపార్టుమెంటు వాళ్ళుకూడా యీ సమయంలో అడవిలోకి పోరు—”

కరుణాకర్, కేశవ్‌లు అతని మాటలు వింటూనే తీవ్రంగా ఆలోచిస్తున్నారు. వాళ్ళ మనసులోకి ప్రవేశించిన మాట ఒకటే! అర్ధరాత్రి పన్నెండు గంటలకు బలి కార్యక్రమం ఉంటుంది. అంటే సరిగ్గా మరో గంటలో....

గంట వ్యవధిలో తామేం చెయ్యగలరో, ఎలా యీ ఘోరాన్ని ఆపుచేయాలో వాళ్ళ మనసుల్ని తొలిచేస్తోంది! అదే సమస్యమీద యిద్దరు మనసులోనే తర్జనభర్జనలు చేసుకొంటున్నారు. త్వరగా అడవి లోపలికి— సిద్ధుడి కొండగుహల దగ్గరకు— చేరుకోవాలి!

అతని దగ్గర సెలవు తీసుకుని, ఇద్దరూ అడవిదారి పట్టారు.

6

“తండ్రీ బిడ్డలిద్దరు యీ కాలవలో శుచిగా స్నానం చెయ్యండి. తరువాత కార్యక్రమం చెపుతాను” అన్నాడు నిత్యానందస్వామి.

జయరాం కుమార్‌తో కలిసి కాలవలోకి దిగాడు.

నీళ్ళు చల్లగా ఒంటిని తాకి వణికింపచేశాయి. కుమార్ కొందరే తట్టుకోలేకపోయాడు.

"డాడీ, బాగా చలిగా వుంది. నేను స్నానం చెయ్యలేను" అన్నాడు, నీటిలోనుంచి బయటకొచ్చెయ్యటానికి ప్రయత్నిస్తూ.

"ఫరవాలేదు కుమార్. రెండు నిముషాలు.... అం అయిపోయింది" అంటూ బుజ్జగిస్తూ ఐస్‌లా ఎముకల్ని కొరికేస్తూన్న నీటిలో, నెత్తురు గడ్డకట్టించే చలిలో స్నానాలు పూర్తిచేశాడు జయరామ్.

ఆకాశంలో మినుకుమంటున్న చుక్కలు కాలువ నీటిలో ప్రతిఫలిస్తున్నాయి. అక్కడ తప్పితే చుట్టు పక్కల యెక్కడా ఆకాశం కూడా కనిపించనంత గుబురుగా పెరిగిపోయిన చెట్లు.

అమావాస్య రాత్రి అంత గాఢాంధకారంగా వుంటుందన్న విషయం ఆ రోజే మొదటిసారిగా తెలిసి వచ్చింది జయరాంకి.

అంతసేపు గట్టుమీద స్వామి నిల్చునే ఉన్నాడు. మళ్ళీ తమ గుడ్డలు వేసుకుంటుంటే వారించి, "అవి వద్దు. పూజకి అర్హమైనవి కావవి. ఈ నారబట్టలు కట్టుకోండి" అన్నాడు నారగుడ్డలు అందిస్తూ.

జయరాం ఎందుకు, ఏమిటని ప్రశ్నించే స్థితిలో లేడు. తన కోరిక మరికొన్ని గంటల్లో నెరవేరబోతున్నదని ఆనందంతో తలమునకలవుతున్నాడు. స్వామి చెప్పింది వేదవాక్కున్నట్టు తు.చ. తప్పకుండా ఆచరిస్తున్నాడు, కుమార్ చేత కూడా ఆచరింపచేయిస్తున్నాడు.

అయితే అతను ఏమాత్రం మనసు పెట్టి ఆలోచించినా, ఇందులో కుమార్ ప్రమేయమెందుకొచ్చిందన్న విషయం

అరమయి వుండేది. కాని అతనిప్పుడు పూర్తిగా స్వామి స్వాధీనంలో వున్నాడు. అతను హిప్నటైజవుతూగా, తను ట్రాన్స్‌లో వున్నవాడిలాగా మంత్రముగ్ధుడిలాగా చేసుకుపోతున్నాడు.

అప్పటికి చీకటికి బాగా అలవాటుపడ్డాయి జయరాం కళ్ళు. చెయ్యి తిప్పి టైం చూసుకోబోయాడు. కాని చేతికి వాచీలేదు. గుహలో వదిలేసి వచ్చాడు స్నానానికి వచ్చేముందు. గుహ దగ్గర బయల్దేరినప్పుడు తొమ్మిది గంటలయింది. ఇప్పుడు మరోగంట కలుపుకోవచ్చుననుకున్నాడు.

మళ్ళీ గుహ దగ్గరకు చేరుకున్నారు ముగ్గురు.

గుహ దగ్గర నలుగురు కోయవాళ్ళు చేతుల్లో నూనె గుడ్డలు చుట్టిన కాగడాలతో నిల్చుని వున్నారు. కొండ గుహలు. ఆ పరిసర ప్రాంతాలు వెలుగుతో నిండిపోయాయి.

చీకట్లోంచి ఒక్కసారిగా వెలుగులోకి రాగానే కళ్ళు మిరుమిట్లు గొలిపాయి జయరాంకి. కుమార్ నిద్ర మత్తులో జోగుతున్నాడు. జయరాం భుజంమీద తల వాల్చి నిద్రపోతున్నాడు.

"నాయనా, బిడ్డ నిద్రపోతున్నాడు. నిద్రపోనివ్వద్దు. జరగవలసిన క్రతువుకి పుత్రుడు తప్పకుండా ఉండాలి" హెచ్చరించాడు స్వామి.

జయరాం చేత్తో తట్టి లేపి కుమార్‌ని బండరాతిమీద కూచోబెట్టాడు.

గుహలో. నాలుగైదు బల్లపరుపుగా వున్న బండరాళ్ళు అమర్చబడి వున్నాయి. వాటిలో ఓ. ఆసనంమీద పులి చర్మం పరచి వున్నది. అది స్వామి ఆసనం! తక్కిన బండరాళ్ళమీద దర్భ చాపలు పరచి వున్నాయి. అవి

జయరాంలాంటి వాళ్ళకు కోయ నాయకులులాంటి ప్రముఖులకు ఆఫర్ చేయబడుతాయి.

స్వామి జయరాంకి బండరాతి ఆసనంమీద కూర్చుండ వలసిందిగా సౌజ్ఞ చేశాడు. జయరాం కుమార్ ని పక్కన కూచో బెట్టుకొని తనూ కూచున్నాడు.

ఓ కోయనాయకుడు స్వామి ఆదేశంమీద ఓ పూసల దండ తెచ్చి జయరాం మెళ్ళో వేశాడు. మరో కోయ వాడు దర్భపుల్లలు, ఆకులు కలిపి కట్టిన మరో దండను తెచ్చి కుమార్ మెళ్ళో వేశాడు.

జయరాం ఎందుకని అడగబోయి అంతలోనే విరమించుకున్నాడు. మొదట్లోనే స్వామి హెచ్చరించి వున్నాడు — ఈ తంతు విషయమై ఎందుకు, ఏమిటని ప్రశ్నించకూడదని, తనమీద పూర్తి విశ్వాసముంటేనే సిద్ధపడమని, లేకుంటే వచ్చినతోవనే తిరిగి వెళ్ళిపొమ్మని చాలా ఖచ్చితంగా చెప్పాడు.

అందుకే జయరాం మనసులో తేలుకొండీల్లా తలెత్తే ప్రశ్నలను మనసులోనే సమాధి చేసేస్తూ వచ్చాడు. నిష్ఠగా క్రతువు చేస్తే తప్ప ఫలితం లభించదని స్వామి చెప్పాడు.

“మా ఆచారం ప్రకారం కొండదేవతకు మొక్కుకుని యే పనైనా మొదలుపెడతాం. బంగారం చెయ్యటం వంటి అతి ముఖ్యమైన పనికి కొండదేవత ఆశీస్సులు చాలా అవసరం. ఓసారి అమ్మను దర్శించుకుని వద్దామా?” అన్నాడు స్వామి జయరాంవైపు నవ్వుతూ చూసి.

“అలాగే స్వామీ! తప్పక వెళ్దాం” అన్నాడు జయరాం.

“నీ బిడ్డను తీసుకువెళ్దాం. మా కొండనాయక

దెబ్బకొకడు ఎత్తుకు తీసుకొస్తాడులే పద!" అన్నాడు స్వామి లేచి ముందుకు దారితీస్తూ.

ఓ కొండ నాయకుడు కుమార్ నెత్తుకున్నాడు. మరో యిద్దరు కాగడాలతో వాళ్ళ ననుసరించారు. ఓ పది నిమిషాల తర్వాత కొండదేవత విగ్రహం దగ్గరకు చేరుకున్నారు.

జయరాం విగ్రహాన్ని చూస్తూనే ఒక్కడుగు వెనక్కు వేశాడు. అతి భయంకరమైన విగ్రహం! దాదాపు పది పన్నెండు అడుగుల ఎత్తుంటుంది. నాలుక ఎర్రగా మండే మంటలా బయటకు చాచి వున్నది. తలనుంచి పాదాల వరకు ఎర్రగా సింధూరం పూయబడి కాగడాల వెలుగులో నయన భయంకరంగా వున్నది.

కుమార్ అయితే ముందే కళ్ళు గట్టిగా మూసేసుకున్నాడు భయంతో. అంత చలిలోను ఆ పసివాడికి ముచ్చెమటలు పోశాయి. సన్నగా ఒణుకుతున్నాడు.

కొండదేవత మెళ్ళోని హారం చూసి జయరాం శరీరం జలదరించింది. వెన్నులో ఏదో పాకినట్టు ఝల్లుమన్నది.

మానవ కపాలాలు మాలగా కట్టి దేవత మెళ్ళో వేశారు. నాల్క చాచుకుని, కపాల హారం మెళ్ళో వేసుకుని, ఓ చేత్తో త్రిశూలాన్ని, మరో చేతిలో విచ్చు కత్తిని పట్టుకుని అరివీర భయంకరంగా వెలిగిపోతున్న ఆ దేవత సజీవమూర్తిలా కట్టెదుట నిల్చి కరవాలంతో తల తెగనరకటానికి సన్నద్ధమై వున్నట్టు కనిపించింది జయరాంకి.

విగ్రహం కాళ్ళ దగ్గర నిప్పురాజేసి వున్నది. విగ్రహం కాళ్ళముందు స్వామి మోకరిల్లి లేచాడు. విగ్రహం

కాళ్ళ ముందర ఓ మట్టిపాత్రలో వున్న భస్మంతీసి నిప్పులో వేశాడు. ఒక్కసారిగా విపరీతమైన పొగ లేచింది. చాలా దట్టంగా అలుముకొంది. పాంబ్రాణి కన్న చాలా ఘాటుగా, ఆ ప్రదేశాన్నంతా అదో రకమైన వింత వాసన చుట్టుముట్టింది.

స్వామి యేదో మంత్రాన్ని ఉచ్ఛస్వరంతో పలుకుతున్నాడు. అది తెలుగు కాదు, సంస్కృతం కూడా కాదు. అదేదో పైశాచిక భాషలాగా వున్నది. కఠిన పదజాలంతో చాలా నిష్ఠగా చదువుతున్నాడు స్వామి.

ఇంతలో ఓ కోయ నాయకుడు రాగిరేకు చుట్టను తెచ్చాడు. దాన్ని స్వామి అందుకుని దేవతా విగ్రహం పాదాల ముందుంచాడు.

జయరాం మనసు పురివిప్పిన నెమలిలా వుంది. ఎదురుగా రాగిరేకు చుట్ట బదులు బంగారు రేకు కనిపించి కన్నులపండువ చేస్తోంది.

స్వామి భస్మం వేసి జయరాం కిచ్చి అగ్నిగుండంలో వేల్చమని చెప్పాడు. జయరాం అలాగే చేశాడు. ఏవో కొన్ని వనమూలికలు కూడా యిచ్చి అగ్నిలో వేయమన్నాడు స్వామి. జయరాం వేశాడు.

నీలిరంగు పొగ దట్టంగా అలుముకున్నది. ఆ ఘాటుకు కుమార్ కి తెరలు తెరలుగా దగ్గొచ్చింది. ఎడతెగకుండా దగ్గుతూ సొమ్మసిల్లి పోయాడు.

అప్పుడు రాత్రి పదకొండు గంటలయ్యింది.

7

కరుణాకర్ చేతిలోని నాలుగుసెల్స్ టార్చ్ ప్రకాశవంతంగా వెలుగు విరజిమ్ముతూ చాలా దూరంవరకు స్పష్టంగా దారి చూపిస్తోంది. ఇద్దరు అడవిదారి పట్టి

పదిహేనునిమిషాలయింది.

అంతకంతకు ఫారెస్టు తాణా ఆఫీసు, కార్టర్సు దగ్గిర పడుతున్నాయి. క్వార్టర్సు బయట ఎవరో మనుషులు మసలుతున్న జాడ కనిపిస్తోంది.

"ఎవరో మసలుతున్నట్టుంది కదూ!" అన్నాడు కేశవ్.

"అందుకే ఆ క్వార్టర్స్ ముందు భాగంనించి కాక, వెనకనుంచి లోపలకి ప్రవేశించే దారేమైనా వుందేమో చూడాలి!"

ఇద్దరు మెల్లగా నడుస్తున్నారు. కరుణాకర్ వేళ్ళ సందునుంచి మాత్రమే టార్చి వెలుగు నేలమీద పడేలా అరచేత్తో అద్దాన్ని మూసిపట్టుకున్నాడు. తమ ఉనికి ఎవరికీ తెలియకూడదని అతని ఉద్దేశం!

పశుపతి చెప్పిన గుర్తులు కేశవ్ బాగా గుర్తుపెట్టుకున్నాడు. క్వార్టర్సుకి కుడివైపు నుంచి రెండు మైళ్ళు నడిస్తే కొండ గుహలొస్తాయి. ఆ కొండ గుహల్లో ఓ దాంట్లో నిధుక్కుంటున్నాడు.

క్వార్టర్సు వెనకపక్క అంతా తుప్పలు, పొదలు పుట్టలతో నిండిపోయివున్నాయి. చురకత్తుల్లా మొన తేలిన రాళ్ళు గుబులు పుట్టిస్తున్నాయి. క్వార్టర్సు ముందునుంచి మాత్రమే దారి చేశారు. క్వార్టర్సు చివరి వరకు ఆ రోడ్డు సాక్షిగా వున్నది.

కరుణాకర్ కేశవ్ వంక చూసి "ఇక క్వార్టర్సు ముందునుంచి వెళ్ళక తప్పేలా లేదు. ఎలా?" అన్నాడు.

క్వార్టర్స్ ముందు ఇద్దరు వ్యక్తులు సిగరెట్లో చుట్టలో తాగుతున్న సూచనగా ఎర్రటి నిప్పు వాళ్ళ పెదాల దగ్గర కనిపిస్తోంది. వాళ్ళు సెంట్రీలో లేక ఆ క్వార్టర్సులో నివాసముంటున్న వాళ్లో కావచ్చును.

"నేను వాళ్ళ దృష్టిని మళ్ళిస్తాను. వాళ్ళు అటు వెళ్ళగానే మనం దాటెయ్యొచ్చు" అన్నాడు కేశవ్.

"ఎలా మళ్ళిస్తావు? వాళ్ళు గమనిస్తే ప్రమాదం కదా... !"

కేశవ్ నేలమీద ఓ మాదిరిగ పెద్దగా వున్న రాళ్ళను ఏరాడు. గార్డ్స్‌కి ఎడమపక్కగా గుబురు పొదల మధ్యకు రాళ్ళు విసిరాడు. పొదల్లో రాళ్ళు సృష్టించిన ధ్వని నిశ్శబ్దంగా వున్న ఆ వాతావరణంలో స్పష్టంగా వినిపించింది.

గార్డ్స్ ముందునించున్న వ్యక్తులిద్దర్లోను ఆశించిన మార్పు కనిపించింది. ఇద్దరు చేతుల్లో గన్స్ పట్టుకుని పొదలవైపు నెమ్మదిగా అడుగులు వేస్తూ వెళ్ళారు. వాళ్ళ చేతుల్లో కూడా టార్చ్ లైట్లున్నాయి.

కేశవ్ కరుణాకర్ వంక చూసి "ఇదేమంచి అవకాశం. పొదం వైపునుంచి వెనక్కి మళ్ళేలోపుగా మనం గుహల వైపు పోయే కుడివైపు దారిపట్టాలి" అన్నాడు వేగంగా అటు అడుగులు వేస్తూ.

కరుణాకర్ అతని వంక ప్రశంసాపూర్వకంగా చూసి, "గుడ్ అయిడియా!" అన్నాడు.

కరుణాకర్ కేశవ్ రెండు నిమిషాల్లో గార్డ్స్‌ను దాటేసి, గుహలవైపు పోయే దారిలోకి మళ్ళిపోయారు. టార్చ్‌లైటు ఫోకస్ చెయ్యకుండా చీకటికి అలవాటు పడ్డ కళ్ళతో దారి వెతుక్కుంటూ కొద్ది గజాలు వెళ్ళారు.

కేశవ్ వెనక్కి తిరిగి గార్డ్స్‌వైపు చూశాడు. ఆ సెంట్రీలిద్దరు మళ్ళీ గార్డ్స్ దగ్గరకొచ్చేశారు. వాళ్ళ మాటలు వినిపించటంలేదు. టార్చ్ ఫోకస్‌నిబట్టి వాళ్ళ

ఉనికిని గ్రహించాడు కేశవ్.

పదిగజాలు తర్వాత సరిగ్గా దారి యిరుకైపోయింది. పొదలు, గుట్టలు దట్టంగా అలుముకుని వున్న ఆ ప్రాంతమంతా అడుగు కదపటానికి వీల్లేకుండా భయోత్పాతం పుట్టిస్తున్నది.

భయంకరమైన నిశ్శబ్దం మధ్య జంతువుల అరుపులు ఒళ్ళు జలదరింప చేస్తున్నాయి. నక్కల ఊళలు కలవరం పుట్టిస్తున్నాయి.

"ఇప్పుడెలా? మనం వస్తున్నది సరైన దారి అయి వుండదు. అందుకే దారి ఇక్కడితో మూసుకుపోయింది. పశుపతి చెప్పిన గుర్తులు బాగా గుర్తుపెట్టుకున్నావా?" అడిగాడు కరుణాకర్.

"సరిగ్గానే వస్తున్నాం. క్వార్టర్సుకి పడమటివైపు నుంచి రెండు మైళ్ళు వెళ్తే గుహలొస్తాయని చెప్పాడాయన."

"దారి సీదాగా వుంటుందని చెప్పలేదు కదా! ఈ చెట్లు, గుట్టలు కోయవాళ్ళకు కొట్టిన పిండి కాబట్టి సరైన దారంటూ లేకపోయినా ఎలాగో నడిచి వెళ్ళిపోగలరు. మనంకూడా యిక తెగించి అలా వెళ్ళాల్సిందే!"

"మనం ఆలోచిస్తూ వుండిపోతే అవతల అర్ధరాత్రి సమీపిస్తోంది. చేతులు కాలాక చేసేదేం లేదు" అన్నాడు కేశవ్. అతను టెన్షన్ భరించలేకపోతున్నాడు.

కేశవ్ వాచీ చూసుకున్నాడు. పదకొండూ యిరవై అయిదు నిమిషాలయింది. అరగంటలో తామిద్దరు కొండ గుహల్ని చేరుకోవటం సాధ్యమేనా?

"ఈ గుట్టమీదుగా నడిచి వెళ్ళిపోదామా?" అన్నాడు

కేశవ్.

"తప్పదు. చుట్టుపక్కల యెక్కడా కాలిబాట కనిపించటంలేదు. కావాలనే దుర్గమంగా వున్న స్పాట్ ఎన్నుకుని వుంటాడా సిద్ధుడు. ఎవరికీ కనిపించకుండా ఎవరు అడ్డుకొనటానికి వీల్లేకుండా తన రహస్య కలాపాలు జరుపుకోవాలి కదా!" అన్నాడు కరుణాకర్.

ఇద్దరు ఏటవాలుగావున్న గుట్ట ఎక్కారు. కాళ్ళు జారిపోతున్నాయి. నిలదొక్కుకుంటూ, ఒకరినొకరు ఆసరా చేసుకుని గుట్ట ఎక్కారు.

మళ్ళీ అవతల పక్కకు స్లోప్‌గా వున్నది. గుట్ట దిగువ నుంచి సన్నని కాలిబాట కనిపిస్తోంది టార్చి వెలుగులో.

"గుడ్! దారివున్నది. జాగ్రత్తగా దిగు...." అంటూ కేశవ్‌ని హెచ్చరిస్తూనే తను ముందుకి తూలిపోయాడు కరుణాకర్. మరుక్షణం బండరాళ్ళమీదకు సరాసరి పడిపోయి వుండేవాడు. కేశవ్ చాలా ఎలర్ట్‌గా పట్టుకున్నాడతన్ని.

ఇద్దరు ఒకరినొకరు పట్టుకుని కిందికి దొర్లిపోకుండా ఆపుకున్నారు.

"థాంక్యూ!" అన్నాడు కరుణాకర్ సర్దుకుని.

సరిగ్గా గుట్ట దిగువన వాళ్ళకోసం ప్రమాదం పొంచి వున్న విషయం వాళ్ళకి తెలియదు.

గుట్ట దిగబోతూ ఎదురుగా కనిపించిన దృశ్యాన్ని చూసి నిశ్చేష్టులై నిలుచుండిపోయారు.

8

కోయ నాయకుల్లో ఒకడు ఆకునేదో నలిపి కుమార్‌కి వాసన చూపించాడు.... కుమార్ వెంటనే కళ్ళు తెరి

చాడు.

అంతవరకూ జయరాం ఆందోళనగా కొడుకు ముఖం లోకే చూస్తూ వుండిపోయాడు. స్వామి మాత్రం చిద్విలాసంగా చూస్తున్నాడు.

“ఫర్వాలేదు నాయనా, నీ బిడ్డ ప్రాణాని కేం ప్రమాదం లేదు, ఆందోళన చెందకు....” అన్నాడు స్వామి.

“నువ్వు నాతో రా నాయనా! నీ బిడ్డను మా వాళ్ళు జాగ్రత్తగా చూస్తూంటారు. మనం వనమూలికల్ని సేకరించుకుని వద్దాం” అంటూ లేచాడు స్వామి.

జయరాం మహదానందంగా స్వామి వెంట బయలు దేరాడు. ఒక నాయకుడు మాత్రం కాగడా పట్టుకుని వారిద్దర్నీ అనుసరిస్తున్నాడు. అలవాటయిన దారిలో జయరాంకన్న వేగంగా ముందుకు పెద్ద పెద్ద అంగలు వేస్తూ నడుస్తూన్నాడు స్వామి. అతనికి ఓ పక్కగా కాగడా పట్టుకున్న నాయకుడు ఒదిగి ఒదిగి నడుస్తూన్నాడు.

దాదాపు ఓ పదినిమిషాలపాటు నడిచారు ముగ్గురూ. ఈ లోపల రకరకాల అడవి జంతువులు వారి ముందు నుంచి పరుగులు పెడుతూ వెళ్ళటం జయరాం గమనించాడు.

కుందేళ్ళు, లేళ్ళు, దుప్పులులాంటి సాధు జంతువులతో బాటు అడవిదున్నలు, జాగిలాలు, తోడేళ్ళు, నక్కలు, ముళ్ళపందులు లాంటి క్రూరజంతువులు కూడా పరుగులు పెడుతూ వెళ్ళటం చూశాడు. మధ్య మధ్య ఎండుటాకుల మీద జరజరా పాక్కుంటూ వెళ్తున్న పాములు కనిపించాయి.

అయితే అవేవీ సిద్ధుడి దరిదాపులక్కూడా రాకుండా ఒదిగి ఒదిగి వెళ్ళిపోవటం చూసి మహా ఆశ్చర్యంగా వుందతనికి.

సిద్ధుడిపట్ల నమ్మకం మరింత పెరిగింది జయరాంకి. అదంతా సిద్ధుడి మహిమే! క్రూరజంతువు సయితం సాధు జంతువుగా మారటం సిద్ధుడి ప్రభావంవల్లనే నని గాఢమయిన నమ్మకం కలిగింది.

తను చాలా అదృష్టవంతుడు! ఎవరికీ సాధారణంగా లభ్యంకాని బంగారం చేసే విద్య తనకీనాడు లభ్యమయ్యింది. మరికాసేపట్లో అమూల్యమయిన బంగారం తన వశం కాబోతోంది. మూలికలు తనవెంట తీసుకుపోవాలి. వీలైనంత యెక్కువ రాగిని బంగారంగా మార్చెయ్యాలి! ప్రపంచంలోకెల్లా గొప్ప ఐశ్వర్యవంతుడ్నయిపోవాలి!

జయరాం ఆలోచనలు బంగారం చుట్టూ తిరుగుతున్నాయి.

"ఇక్కడ ఆగు నాయనా! అదిగో, ఆ దేవదారు చెట్టుకింద పరీక్షగా చూడు. పసుపు పచ్చని పువ్వులున్న మొక్కలేమయినా కనిపిస్తున్నాయా?" అన్నాడు స్వామి.

జయరాం కళ్ళు చికిలించి దేవదారు చెట్టువైపు పరిశీలనగా చూశాడు.

అతని కళ్ళు మిలమిల మెరిశాయి.

చెట్టు కింద పసుపు పచ్చని పూలున్న మొక్కలున్నాయి!

"ఉన్నాయి స్వామీ!" అన్నాడు.

స్వామి జయరాం భుజం తట్టి, "నీ క్రతువు ఫలిం

చింది నాయనా! నిష్ఠగా క్రతువులో నీ బిడ్డతో బాటు పాల్గొన్నందుకు నీ అభీష్టం నెరవేరింది. ఆ మొక్కలను వేళ్ళతో పాటు పెరికి, వేరు భాగం గుప్పిట్లో మూసి తీసుకొని రా. గుహలో బంగారం ఎలా చెయ్యాలో చెప్తాను" అన్నాడు.

జయరాం మొక్కల్ని పీకి వాటి వేరులను గుప్పిట్లో మూసి పట్టుకున్నాడు.

"ఎన్ని మొక్కలు పెరకను స్వామీ!"

"నాలుగు చాలు!" అన్నాడు స్వామి.

నాలుగు మొక్కల్ని పెరికి స్వామి వెంట గుహకు తిరిగివచ్చాడు జయరాం.

"వేరు భాగాలని చితక్కొట్టి రసం వచ్చేవరకు గట్టిగా పిండు....ఆఁ!....ఇప్పుడు ఆ రసాన్ని ఈ రాగి రేకుకి పూర్తిగా పొయ్యి. నేను చెప్పే మంత్రం పఠించు" అన్నాడు స్వామి ఆసనంపై కూచుని.

జయరాం అతను చెప్పినట్టే మంత్రం చదువుతూ రాగి రేకుపై ఆ వేళ్ళ రసాన్ని మలాము చేశాడు. పదినిమిషాలు గడిచాయి.

రాగిరేకు ఎలాంటి దలాగే వున్నది.

బంగారు రేకుగా మారలేదు.

అప్పుడు సమయం పదకొండునలభైఅయిదు నిమిషాలయింది!

స్వామి పెదవి విరిచి, "లాభంలేదు నాయనా! నీ నిష్ఠకు కొండదేవత సంతృప్తిపడలేదు. ఆమెను సంతృప్తి చేయటానికి ఒక్కటేమార్గం! ..." అన్నాడు ఓ క్షణం ఆగి.

జయరాంలో టెన్షన్ పెరిగిపోయింది. అంత క్రితం

చరకూ తనకు బంగారం చేసే విద్య పట్టుబడిపోయిందని ఆనందంతో తలమునకలయ్యాడు. కాని ఇంతలోనే పరిస్థితి తారుమారయ్యింది. ఇంతపడ్డ శ్రమ వ్యర్థమేనా....?

స్వామి ప్రశ్నకు బదులుగా, "చెప్పండి స్వామీ! కొండదేవతను సంతృప్తిపరుస్తాను. వెంటనే చెప్పండి!" అన్నాడు.

"కాని.... కాని.... అది జరిగే పనికాదు నాయనా! నిన్నలాంటి పని చేయమని నే నడక్కూడదు. నువ్వు చెయ్యకూడదు. వద్దు నాయనా, బంగారంమీద ఆశ వదులుకొని నీ బిడ్డతోబాటు యింటికి తిరిగి వెళ్ళిపో!" అన్నాడు స్వామి.

అతనలా అనే కొద్దీ జయరాంలో పట్టుదల దృఢ నిశ్చయం మరింతగా బలపడ్డాయి. "ఫర్వాలేదు స్వామీ! మీ మాట శిరసావహిస్తాను. ఇంతదాకా వచ్చాక సంకోచిస్తాననుకొంటున్నారా....? అసంభవం! చెప్పండి...." అన్నాడు.

"వద్దు నాయనా! నా మాటమీద యే మాత్రం గౌరవమున్నా వెంటనే నీవు యింటికి తిరిగి వెళ్ళిపో, నీ బిడ్డతోబాటు! ఇంకొక్క క్షణం కూడా యిక్కడ వుండొద్దు."

"స్వామీ! నన్ను శంకించకండి. వెంటనే చెప్పండి. నా నిష్ఠ నిశ్చయం తిరుగులేనివి" చాలా సిన్సియర్ గా చెప్పాడు జయరాం.

సిద్ధుడు లేచి నిల్చొని సూటిగా జయరాం వంక చూసి, "చేస్తానంటావా? అన్న మాటకు నిలబడగలవా?" అన్నాడు.

జయరాం స్థిరంగా చెప్పాడు, "చేస్తాను!"

"అయితే విను. నీకు బంగారంచేసే విద్య పట్టుబడా లంటే యేం చెయ్యాలో చెపుతున్నాను. గుండె దిటవు చేసుకుని విను! నీ కన్నకొడుకును నీ చేతుల్తోనే ఒక్క వేటుకు నరికి అమ్మకు రక్తతర్పణ చెయ్యాలి. ఆ మరు క్షణం నీకు ఆ విద్య వశమవుతుంది" అన్నాడు నిత్యానందస్వామి.

నెత్తిన పిడుగుపడ్డట్టు చేష్టలుడిగి,కొయ్యబారిపోయాడు జయరాం.

పన్నెండు కావటానికి అయిదు నిమిషాలు మాత్రం మిగిలివుంది.

9

కొంతసేపటి వరకు తేరుకోలేదు కేశవ్, కరుణాకర్.

గుట్ట దిగువన బాటమీద అడ్డుగా పడుకొనివుంది పెద్ద పులి! చాలా తాపీగా, హుందాగా, దర్జాగా పడుకొని విశ్రాంతి తీసుకొంటోంది. ఏమాత్రం అలికిడి అయినా తమమీదికి దూకి చీల్చి చెండాడుతుంది. అప్పటికే ఇద్దరు గుట్ట దిగిపోయారు.

పులికి, వాళ్ళకు మధ్యదూరం కేవలం కొన్ని గజాలు మాత్రమే! ఇద్దరూ ఊపిరి బిగబట్టి దానివంకే గుడ్లప్ప గించి చూస్తూన్నారు.

పులి యిప్పట్లో అక్కడ్నుంచి వెళ్ళేలా కనిపించటం లేదు. ఓ పక్క సమయం మించిపోతోంది. అర్ధరాత్రి దగ్గర పడుతోంది. పశుపతి మాటలు చెవుల్లో గింగురు మంటున్నాయి.

"ఓ అయిడియా!" అన్నాడు కేశవ్.

"ఏమిటది?"

"మంటల్ని చూస్తే పులి బెదిరిపోతుందంటారు కదా!

ఎండు చితుకులు పోగుచేసి మీ దగ్గరున్న లైటర్ తో వెలిగిద్దాం మంట లేకగానే పారిపోతుంది పులి! మనకి దారి సుగమం అవుతుంది. ఏమంటారు?" అన్నాడు కేశవ్.

"గుడ్ ఐడియా! చప్పుడు రాకుండా చితుకులు పోగుపెడదాం" అన్నాడు కరుణాకర్.

అడవిలో ఎండుపుల్లలకి కొదవేమిటి? పదినిమిషాల్లో పేర్చి మంట పెట్టారు.

పెద్దపులి ఒక్కసారిగా లేచి నిల్చున్నది! గుర్రు మన్నది.

కేశవ్ కి, కరుణాకర్ కి టెన్షన్ తో నాలుక పిడారి పోయింది. అంత చలిలోను ముచ్చెమటలు పోశాయి. అది యెగిరి తమమీదికి దూకితే....!? తమకి తప్పించుకోవటానికి మరో దారి లేదు.

పులి వాళ్ళూహించినట్లు మంట చూసి పారిపోలేదు సరికదా, మంటవైపు అడుగులు వేస్తూ వస్తోంది.

ఇద్దరూ ఆశ్చర్యంతో ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. తమ అంచనా ఘోరంగా తప్పింది.

కరుణాకర్ వెంటనే ఓ నిర్ణయాని కొచ్చేశాడు.

"కేశవా, అది మేనిటర్ లా వుంది. అందుకే నరవాసన తగలగానే ఇలా వస్తోంది. సాధారణమైన పెద్దపులి అయితే యీ పాటికి మంటచూసి పారిపోయుండేది. హారియావ్! యీ పక్కనున్న మఱ్ఱిచెట్టు యెక్కేద్దాం" అంటూ ఒక్క అంగలో మఱ్ఱిచెట్టు పక్కకు ఉరికి పైకి ఎగబ్రాకసాగాడు.

కేశవ్ కి చెట్లెక్కటం సరిగా రాదు__అందుకే అతను నేలబారుగా వేలాడుతున్న ఊడలు పట్టుకుని పైకి

యెగబాకాడు — కాని సరిగ్గా అప్పుడే పులి గుండెలవిసేలా గాండ్రించి, వాళ్ళిద్దరి మీదకు లంఘించింది.

అప్పటికి కరుణాకర్ చెట్టు కొమ్మమీదికి యెక్కేశాడు. కాని కేశవ్ మాత్రం ఊడలు పట్టుకుని వేలాడుతూనే వున్నాడింకా.

పెద్దపులి చెట్టుకిందికి వచ్చేసింది. నేలమీది నుంచి గుర్రుపెడుతూ యెగిరి కేశవ్‌ని అందుకోబోతున్నది. కేశవ్‌కి టెన్షన్ అధికమయింది. అయినా తొందరపడలేదు. నిదానంగా పైకి యెగబాకటానికే ప్రయత్నం చేశాడు. పట్టు జారిపోకుండా ఫర్మ్‌గా పట్టుకున్నాడు ఊడని. అదే అతడి ప్రాణం కాపాడింది!

ఈలోపల కరుణాకర్ పైనుంచి తలకిందులుగా వాలి చేతులు అందించాడు సర్కస్‌లోలాగా. ఆ చేతుల్ని పట్టుకొని ఓ చేత్తో వూడని గట్టిగా పట్టుకొని పైకి యెగబాకి కొమ్మనందుకున్నాడు కేశవ్.

నేలమీద పెద్దపులి నిప్పులుతొక్కినట్టు చిందులు వేస్తోంది. గుర్రుమంటూ ఘూర్ణిల్లుతోంది. ఏమాత్రం అందినా కేశవ్‌ని చీల్చేసివుండేది!

కేశవ్, కరుణాకర్ గుబురుగా వున్న కొమ్మల మధ్య కాసేపు సేదతీరేవరకు కూర్చున్నారు. వాళ్ళు పైన కూచుంటే కింద పులి తాపీగా మళ్ళీ నేలమీద బైఠాయించింది, యెదురుగా వున్న ఆహారాన్ని వదులుకోవటానికి యిష్టంలేనట్టు.

కేశవ్, కరుణాకర్ మరోసారి దాని ప్రవర్తనకి విస్తుపోయారు.

“ఇదేమిటి, యిలా అయింది? మనం యిక్కడ్నుంచి ఒక్క అంగుళం కూడా కదల్లేం. అవతల పన్నెండు

గంటలకు జరగబోయే ఘోరాన్ని ఆపగలమా? చేశేతులా కుమార్ ని బలిచేసుకోవటమేనా? కుమార్ తో పాటు అన్నయ్యని కూడా చంపేస్తారు, అనుమానం లేదు!" కేశవ్ గొంతు వణికింది.

కరుణాకర్ యేదో చెప్పబోయాడు. సరిగ్గా అప్పుడే ఓ లేళ్ళ జంట చెంగాటాలాడుకుంటూ అటు పరుగెత్తుకొని వచ్చింది.

పెద్దపులి తన సహజగుణాన్ని వెంటనే చూపించుకుంది. ఒక్కసారిగా లేచి ఆ లేళ్ళ జంటమీదికి లంఘించింది. కడుపునిండా తిన్నా కూడా పులి వేటాడి చంపటం మానదు! మాంసాన్ని దాచుకుని కుళ్ళబెట్టుకుని తినటం దాని కలవాటు!

కరుణాకర్ పులి లేళ్ళ వెంట పరుగెత్తటం చూసి "కిందకు దూకేద్దాం. అది మళ్ళీ చెట్టుకిందికి వచ్చేసరికి మనం ఈ పరిసర ప్రాంతాల్లో ఎక్కడా వుండకూడదు" అన్నాడు.

ఇద్దరు ఊడలు పట్టుకుని నేలమీదికి జారిపోయి, పరుగందుకున్నారు. కాలిబాట నిదానంగానే వున్నది. దారిలో ముళ్ళకంచెలు గీరుకున్నా, ఛురకత్తుల్లా లేచి వున్న రాళ్ళ మొనలు గుచ్చుకున్నా వాళ్ళు లెక్క చేయ లేదు.

అయితే వాళ్ళింకా కొన్ని గజాలు పరుగుత్తారో లేదో వెనుక నుంచి పులి గాండ్రింపు వినిపించింది.

కరుణాకర్ ముందుకు పరుగెడ్తూనే, "పులి మన జాడ పసి గట్టేసింది. ఇక ఎంతసేపో మనం పరుగెత్తలేక పోవచ్చు. ఇదిగో కత్తి. చెరొక కత్తి పట్టుకుని పులిమీద తిరగబడటం ఒకటే తరుణోపాయం! చావు ఎలాగూ

తప్పదని తెలిపోయాక, దాంతో ప్రాణంకోసం పోరాడుతూ చద్దాం" అన్నాడు సంచిలోంచి కత్తులు రెండూ పైకితీసి.

ఇద్దరికీనూ తెగింపు వచ్చేసింది.

చేతో కత్తి పట్టుకున్నారు.

పులి గాండ్రింపు మరింత దగ్గిరపడింది.

వాళ్ళిద్దరు ఆగిపోలేదు. తమ శక్తికొలదీ ముందుకు పరుగెడుతూనే వున్నారు.

10

"చూశావా, అందుకే అది నీకు చేతగాని పనని, మెదలకుండా యింటికి తిరిగి వెళ్ళిపొమ్మనీ చెప్పాను. కాని, నా చేత ఆమాట కాస్తా పలికించావు. నీకు బంగారం కావాలి. కాని, అందుకు రక్తతర్పణం చెయ్యటానికి మాత్రం సిద్ధంగా లేవు. ఈ మాత్రానికి ఎందుకు, గొప్పగా 'మీ మాట శిరసావహిస్తాను' అంటూ ప్రగల్భాలు పలికావు. నీకీ జన్మలో బంగారంచేసే విద్య పట్టుబడదు" అన్నాడు సిద్ధుడు కోపంగా.

జయరాం దిగ్భ్రాంతినుంచి యింకా తేరుకోలేదు. కొడుకును బలిచ్చే తండ్రి వుంటాడా? ధనంకోసం అంత నీచానికి, ఘోరానికి దిగజారే తండ్రి యెవడూ వుండడు. ఉన్నా ఒక్కగానొక్క బిడ్డను చేజేతులా చంపుకునే కిరాతకుడు కాదు తను!

అతనికి ఒకటొకటిగా సిద్ధుడి చర్యలు గుర్తొచ్చాయి.

ఇదంతా ఓ ప్లాన్ ప్రకారం జరిగినట్టుగా అనిపిస్తోంది. నిజానికి యీ సిద్ధుడికి బంగారం తయారుచేసే విద్య తెలిసి వుండదు. తనని మధ్యపెట్టి, కుమార్ని యిక్కడికి రప్పించటానికి పన్నిన పన్నాగం అది!

కావాలంటే తనకి తెలియకుండా కుమార్ ని యీ సిద్ధుడి మనుషులే యెత్తుకుని రావచ్చును కదా! తనని ఎందుకు ఎన్నుకున్నట్టు? తనయితే యెవరికీ అనుమానం రాకుండా తేగలడని తనని నియోగించి వుండాలి!

బంగారం భ్రాంతిలో తను పూర్తిగా మునిగిపోయి, కళ్ళు మూసుకుపోయి స్వామి ఆడించినట్లల్లా కీలుబొమ్మలా ఆడాడు. ఫలితం - కన్న కొడుకునే బలిచ్చుకోవలసి వచ్చింది.

'భగవాన్! పగవాడిక్కూడా యిలాంటి పరిస్థితి యెన్నడూ ఎదురుకాకూడదు. ఏ తండ్రికీ తన బిడ్డని చంపుకోవలసిన దుర్గతి పట్టకూడదు' మనసులోనే కుమిలి పోయాడు జయరాం.

ఏమైనాసరే తను వీళ్ళ ప్రలోభానికి లొంగకూడదు. వెంటనే కుమార్ ని తీసుకుని యిక్కడ్నుంచి పారి పోవాలి! లేకుంటే కుమార్ తోబాటు తనుకూడా వీళ్ళ స్వార్థానికి బలికాక తప్పదు.

బలి! అవును, ఈ సిద్ధుడు యేదో ఫలితాన్నాశించి బలికార్యక్రమాల్ని జరుపుతున్నాడన్న మాట. తను__ బలిపశువుగా చిక్కాడు. వాళ్ళకి తనే కావలసివుంటే తననీ నాటికే బలిచ్చి వుండేవారు. కాదు కుమారే కావలసి వున్నా, ఈపాటికి తనని పెడరెక్కలు విరిచి కట్టి తన కళ్ళముందే కుమార్ ని నిర్దాక్షిణ్యంగా బలిచ్చి వుండేవారు. రెండూ జరగలేదు అంటే....?!

అతనికి అర్థం అయ్యీ కాకుండా వుంది. బలివ్వటం ఒక్కటే వాళ్ళ ధ్యేయంకాదు. మరేదో వుంది.

ఏమిటది?!....

తట్టింది! తన చేతుల్తోనే తన కొడుకును బలివ్వటం

వీళ్ళ ధ్యేయం. అవును, ఖచ్చితంగా అదే! అందుకే తనని బంగారం ప్రలోభంతో కన్నకొడుకునే రక్త తర్పణం చెయ్యాలనే కండిషన్ మీద ప్రేరేపించ బోయారు.

అంటే, వీళ్ళ నమ్మకాల ప్రకారం తండ్రి తన స్వహస్తాలతో కన్నబిడ్డని దేవికి బలివ్వాలేమో! అప్పుడు ఆ సిద్ధుకి క్షుద్ర కోరిక ఏదో నెరవేరి అతనిక్కావలసిన శక్తులేవో సిద్ధిస్తాయేమో! అందుకే ఈ తంతంతా జరిపించి వుంటాడు.

జయరాం పిడికిళ్ళు కోపంతోను, ఉక్రోషంతోను, ప్రతీకార వాంఛతోను బిగుసుకున్నాయి. ఈ స్వామి యెంత నాటకమాడాడు? తను యెంత తేలిగ్గా వీళ్ళ ప్రభావంలో యిరుక్కుపోయాడు!? ఏమయినా సరే, వీళ్ళ నెదిరించయినా సరే, యిక్కడ్నుంచి తప్పించుకు పోవాలి!

“ఏం మాట్లాడవు? రక్త తర్పణ చేస్తావా, లేదా?” హుంకరించాడు స్వామి. అతని వదనంలో యిప్పుడు ప్రశాంతత, ఆప్యాయత, చల్లదనం లేవు. కళ్ళు రక్తాన్ని వర్షిస్తున్నాయి. ముఖంలో క్రూరత్వం పైశాచికత్వం నాట్యం చేస్తున్నాయి. నరరూప రాక్షసుడిలాగా, పీనుగులను పీక్కుతినే రాబందులాగా, క్రూరంగా వున్నాడు. అంతకన్న క్రూరంగా మాటల పిడుగుల్ని వర్షిస్తున్నాడు.

“క్షమించండి స్వామీ! అది నావల్లకాదు. నాకు బంగారం అక్కర్లేదు. నాకు కన్నకొడుకును చంపుకోవటం చేతకాదు. నన్నొదిలెయ్యండి. ఇష్టంలేకపోతే ఇంటికి తిరిగిపొమ్మన్నారుకదా, వెళ్ళిపోతాను” అన్నాడు

జయరాం.

సిద్ధుడు వికటాట్టహాసం చేశాడు. "ఎక్కడికి పోతావు? నిన్నంత తేలిగ్గా వదుల్తాననుకున్నావా? నిన్ను వదిలి పెట్టడానికేనా నాలుగు రోజుల్నుంచి యింత శ్రమ తీసుకున్నది? నీ చేత రక్త తర్పణం చేయించితీరాను. అందుకు నువ్వు ఒప్పుకోకుండా బెట్టు చేశావంటే నేనే మీ ఇద్దరి రక్తంతో దేవతకి విందు చేస్తాను.

నీ బిడ్డను నేను చెప్పిన ప్రకారం బలిచ్చేస్తే, నీ ప్రాణాలు దక్కుతాయి. మూర్ఖంగా ఎదురుతిరిగితే ఇద్దరి ప్రాణాలు గాల్లో కలిసిపోతాయి. వెంటనే నీ నిర్ణయం చెప్పు! పుణ్యకాలం యిక కొద్ది నిమిషాలు మాత్రమే మిగిలి వుంది. ఈ ముహూర్తం తప్పితే మళ్ళీ ఓ నెల ఆగాల్సి వుంటుంది. అమావాస్య నెలకి ఒకసారే వచ్చేది!" తొందర చేశాడు సిద్ధుడు.

జయరాం మనసు భగ భగ మండిపోతున్నా సౌమ్యంగానే సమాధానం చెప్తున్నాడు.

ఎదురు తిరిగి ప్రాణాలతో బయటపడటం చాలా కష్టం. నలుగురు పోతరించిన ఎనుబోతుల్లాంటి ఆటవికులు విచ్చుకత్తులతో తనవైపే దృష్టిని కేంద్రీకరించి చూస్తున్నారు. సిద్ధుడి కనుసైగయితే చాలు నాలుగు కత్తులు తన శరీరాన్ని తుత్తునియలు చేసి రక్తాన్ని వరదలుగా పారిస్తాయి. అందుకే స్వామిని మభ్యపెట్టో నచ్చచెప్పో బయటపడాలి!

"స్వామీ! ఎంత చెడ్డా కన్న తండ్రిని కదా! కడుపు తీసి చంపుకోలేను. కన్న కొడుకును చంపుకోవటం నావు చేతకాదు. నా కొడుకుమీది పాశాన్ని తెంచుకోగలను గాని, నా చేతులారా వాడ్ని చంపలేను."

"చంపటం కాదు—రక్త తర్పణ చేయటం! అమ్మ వారు అనుగ్రహిస్తూంది. నీవు కావలసినంత బంగారం నేనిస్తాను. రాగినుంచి తయారుచేసి కాదు, నిజమైన మేలిమి బంగారం! నువ్వు బతికున్నంత కాలం మహారాజ వైభోగంతో బతకటానిక్కావలసినంత బంగారమిస్తాను. అయితే నీ చేతుల్తో నువ్వే నీ కొడుకును నరకాలి. అదీ నిబంధన!"

జయరాంకి అంతవరకు యే మూలో చిన్న అనుమానముంటే అది కాస్తా తీరిపోయింది.

తను ఊహించింది కరెక్టే! తన చేతుల్తో తనే తన బిడ్డను బలివ్వాలన్నది కండిషన్! వాళ్ళ పద్ధతి ప్రకారం తను ఈ బలి కార్యక్రమాన్ని తన చేతుల మీదుగానే నిర్వహించాల్సి వుందన్నమాట!

"ఆలస్యమవుతున్నది, వెంటనే తెముల్చాలి. పుణ్య కాలం మించిపోతోంది" తొందర చేశాడు సిద్ధు.

"స్వామీ, ఎంత సరిపుచ్చుకుందామనుకున్నా నా మనసంగీకరించటంలేదు. ఈ పని నావల్ల కాదు" మొండి ధైర్యంతో తెగించి చెప్పేశాడు జయరాం.

స్వామి అతిన్ని వేగంగా సమీపించి రెండు చెంపలు చెళ్ళుమనిపించాడు.

"ద్రోహీ! నన్నే ఎదిరిస్తావా? ఇందుకు శిక్ష అనుభవించటానికి సిద్ధంగా వుండు! నాతో పంతంపట్టి బతికి బట్టకట్టిన వాడెవడూ లేడు! ఆ కాగడాలు చూడు! వాటి వెలుగును యిక నువ్వు చూడలేవు. ఎందుకంటే వాటితో నీ రెండు కళ్ళు పొడిచేస్తున్నాను కదా!" అంటూ కాగడాలు రెండూ రెండు చేతుల్లోకి తీసుకున్నాడు స్వామి నిత్యానంద.

11

పులి బాగా దగ్గర పడిపోయింది.

ఆ పాటికి కరుణాకర్, కేశవ్ బాగా అలసి పోయారు. కాళ్ళకి చెప్పులున్నా, ముళ్ళు, రాళ్ళు వాళ్ళ మోకాళ్ళవరకు గాయాలు చేశాయి.

హడావిడిలో కేశవ్ యేదో మెత్తని వస్తువుమీద కాలువేసి, అది పాము అని గ్రహించి కెంబేలెత్తి పోయాడు. కాని అదృష్టవశాత్తూ అది కాటందుకోలేదు. బెదిరిపోయి పారిపోయుంటుంది.

కరుణాకర్ పరిస్థితికూడా దాదాపు యిలాగే వుంది. భుజాన బేగ్ అదనపు బరువు. ఆయాసంతో ఒగర్చుతూ పిక్కబలంకొద్దీ పరుగెడుతున్నాడు. దారి ఎగుడుదిగుడుగా వుంది. రాళ్ళు రప్పలు గుడ్డల్ని పాదాల్ని చీల్చేస్తు న్నాయి. అయినా వేటినీ లెక్కచేయకుండా పరుగెడు తున్నాడు. కేశవ్‌ని హెచ్చరిస్తున్నాడు.

పులి పదిగజాల దూరంలోకి వచ్చేసింది. కరుణాకర్ ఓ నిర్ణయానికొచ్చేశాడు.

“కేశవ్, పులి వెనుకపాటున మనమీదికి దూకి చీల్చి వేసేలా వుంది. మనం తిరగబడటం తప్ప గత్యంతరం లేదు. చుట్టుపక్కల అన్నీ చెట్లే. కాని యెక్కటానికి మాత్రం టైంలేదు. మనం వట్టి చెట్టుమీదినుంచి దిగి చాలా పొరపాటు చేశాం” అన్నాడు.

కేశవ్‌లో మొండిధైర్యం, తెగింపు వచ్చేశాయి.

“ఓ.కే! ఇద్దరం చెరో పక్కనుంచి ఎటాక్ చేద్దాం. దాన్ని కన్‌ఫ్యూజ్ చేసి, మనం దానికి ఆహుతయి పోవటమో చేతనైతే దాన్ని అంతం చేయటమో తేలి పోవాలి?” అన్నాడు స్థిరంగా.

కరుణాకర్ అకస్మాత్తుగా పరుగెత్తటం ఆపేసి టార్చిలైట్ సిద్ధంగా పట్టుకున్నాడు. కుడిచేతుల్లో ఇద్దరు పొడవాటి కత్తుల్తో పులిమీదకు తిరగబడటానికి తయారై నించున్నారు.

పులి రెండు గజాల దూరంలో వుంది.

కరుణాకర్ టార్చిని దాని కళ్లల్లోకి ఫోకస్ చేశాడు. పులి టక్కున ఆగిపోయింది. దాని కళ్ళు నిప్పుకణికల్లా మెరుస్తున్నాయి.

రెండు క్షణాలు మాత్రమే అలా చూసింది. ఆ తర్వాత మెరుపువేగంతో గాల్లోకి యెగిరింది. కరుణాకర్ దాని ముఖంమీదికి ఫోకస్ చేయటం మానలేదు. దాని కళ్ళల్లోకి వెలుగుపడటంవల్ల చీకట్లో వున్న వ్యక్తులమీదికి గురిగా ఎగరలేదని అతనికి తెలుసు!

అదే జరిగింది! కరుణాకర్‌కి అడుగుదూరంలో నేల మీదికి గెంతింది పులి!

అవకాశంకోసం ఎదురుగా చూస్తున్న కేశవ్ ఆ స్ప్లిట్ సెకండ్‌ని బాగా వినియోగించుకున్నాడు. బలంగా దాని డొక్కల్లో కత్తితో పొడిచాడు.

పులి బాధతో పెద్దగా గాండ్రించింది. కేశవ్ వైపు మహోగ్రంగా పంజా విసిరింది. చాలా లాఘవంగా దాని దెబ్బనుంచి తప్పించుకున్నాడు కేశవ్. పులి కేశవ్ వైపు దృష్టి మరల్చగానే కరుణాకర్ దాని మెడమీద తన కత్తితో శక్తినంతా ఉపయోగించి పొడిచాడు.

మరోసారి అడవి దద్దరిల్లిపోయేటట్టు గట్టిగా గర్జన చేసింది పులి. టార్చిలైటుని దాని కళ్లలోకి ఫోకస్ చేస్తూ దాన్ని కన్‌ఫ్యూజ్ చేసేస్తున్నాడు, కరుణాకర్. అవ

కాశం దొరికినప్పుడల్లా శక్తితో అందినచోటల్లా యిష్టం వచ్చినట్టు పొడిచేస్తున్నాడు కేశవ్. అయితే దాని పంజా దెబ్బనుంచి మాత్రం తప్పించుకోలేకపోయాడు.

కేశవ్ జబ్బమీద నిలువునా పంజాతో గీరేసింది పులి. పట్టు పీలికలైపోయి గాయమయింది. రక్తం చారలుగా చిమ్మన చిందింది. బాధతో మూలిగాడు కేశవ్. కేశవ్ మీద దాడిచేసిన సమయంలో కరుణాకర్, కరుణాకర్ వైపు తిరిగినపుడు కేశవ్—దాని శరీరాన్ని తూట్లుగా పొడి చేశారు.

పులి బలం క్షీణించిపోయింది. రక్తంతో దాని ఒళ్ళంతా వరదలైపోయింది. నేల కూలిపోయి చాలా సేపు గిలగిల కొట్టుకుంది. తర్వాత దాని శరీరం చలనరహిత మయిపోయింది.

కేశవ్‌కి పులి చేసిన గాయం సలుపు పెడుతోంది. కరుణాకర్ చాలా ఎలర్టుగా పోరాడటం వల్ల స్వల్ప గాయాలతో తప్పించుకున్నాడు.

ఇద్దరు బాగా అలిసిపోయారు.

కరుణాకర్ కేశవ్ జబ్బపైకి టార్చి ఫోకస్ చేసి, "గాయం బాగా లోతుగా అయినట్టుందే, బాగా బాధ పెడుతోందా?" అన్నాడు.

కేశవ్ నీరసంగా నవ్వి, "ప్రాణం దక్కింది కదా! గాయం ఎంత పెద్దదైతే నేం?" అన్నాడు.

కరుణాకర్ వాచ్ చూసుకుని "అరె, పన్నెండు దాటిపోయింది" అన్నాడు ఆందోళనగా.

కేశవ్ కూడా వాచ్ చూసుకుని, "పన్నెండు దాటి పదిహేను నిమిషాలయింది. పశుపతిగారు చెప్పిందాన్ని బట్టి సరిగ్గా పన్నెండు గంటలకే సిద్ధుడు బలికార్యక్రమం

జరపడం అనవాయితీ. ఈరోజూ అలాగే జరిపివుంటే."

తిక్కన వాక్యం పూర్తి చెయ్యలేదు. అప్పటికే అతని మనసంతా చికాకై పోయింది. మెదడు ఆలోచించే శక్తిని కోల్పోయి మొద్దుబారిపోయింది.

కరుణాకర్ సాలోచనగా తలూపి, "మన శక్తి వంచనలేకుండా కృషి చేస్తూన్నాం. మధ్యలో యీ క్రూరమృగం, మన వెంటపడి వుండకపోతే ఈపాటికి సిద్ధుడి గుహ చేరుకుని వుండేవాళ్ళం! ఇప్పటికైనా మించిపోయింది లేదు. కమాన్, హారియప్!" అంటూ వేగంగా ముందుకు అడుగులు వేశాడు.

కేశవ్ పులిచేసిన గాయంనుంచి రక్తం స్రవించకుండా చేతి రుమాలుతో నొక్కిపట్టి కట్టుకున్నాడు. శారీరక బాధకన్నా మానసికంగా అతను పడుతున్న బాధ వర్ణనాతీతం!

ఇద్దరు కాలిబాట వెంట నడుస్తున్నారు. పులిని చంపిన కత్తులింకా వాళ్ళ చేతుల్లోనే వున్నాయి. మళ్ళీ యేదైనా అవాంతరం యెదురయితే యెదుర్కోవాలని నిర్ణయించుకున్నారు.

బాట బాగానే కనిపిస్తోంది. కరుణాకర్ టార్చ్‌తో ముందున్నాడు. అతన్ని వెన్నంటి కేశవ్ నడుస్తున్నాడు.

ఇద్దరు ఓ యాభై గజాలు నడిచారు నిర్విరామంగా. కొండగుహాల జాడ ఎక్కడా కనిపించటంలేదు. పశుపతి మాటలు మళ్ళీ మననం చేసుకున్నాడు కేశవ్.

క్వార్టర్సుకి కుడి పక్కనుంచి రెండు మైళ్ళు నడవాలని చెప్పాడు. తామిప్పటివరకు నడచిన దూరం రెండు మైళ్ళకు తక్కువుండదని అంచనా వేశాడు. మరి యెక్కడా కొండగుహాల జాడ కనిపించటంలేదు.

మరో పదినిమిషాలు నడిచారిద్దరు.

సరిగ్గా అప్పుడే ఊహించని సంఘటన జరిగిపోయింది. ఏదో భీకరంగా వున్న ఆకారం చెట్టుపైనుంచి సరాసరి కరుణాకర్ మీదికి గెంతింది.

అంతే, అతని చేతిలోని టార్చి ఎగిరి అంతదూరంలో పడింది.

కరుణాకర్, కేశవ్ ఊహించని ఈ హఠాత్పరిణామానికి నిశ్చేష్టులై కొద్దిక్షణాలు కర్తవ్య విమూఢులై నిలుచుండిపోయారు.

12

జయరాం భయంతో, గగుర్పాటుతో రెండు కళ్ళు మూసుకున్నాడు.

స్వామి రెండు చేతుల్లోను రెండు ఖాగడాలు పట్టుకుని అతిన్ని సమీపించాడు.

"ఇప్పటికయినా మించిపోయింది లేదు. నీకు మరో అవకాశమిస్తున్నాను. ఆలోచించుకో! చేజేతులా నీ కళ్ళు పోగొట్టుకోకు. మా మాట కాదంటే ఒక్కొక్కటిగా నీ అవయవాలన్నీ ఖండించి నిన్ను చిత్రవధ చేస్తాను. నాతో శత్రుత్వం నీకు మంచిది కాదు, ఆలోచించుకో!" అన్నాడు స్వామి.

జయరాం మాట్లాడలేదు. కళ్ళు మూసుకుని తీవ్రమైన మనోక్షోభతో తలవిదిలించాడు.

స్వామి అసహనంగా చూశాడతనికంక.

"ఏమిటి మాట్లాడవు? నా మాటలు అర్థంకావటం లేదా? నీకన్న మొండివాళ్ళను నా దారికి తెచ్చుకున్నాను. నన్నెదిరించిన వాళ్ళను నాశనం చేశాను. వాళ్ళ కపాలాలు అమ్మ మెడలో హారంగా గుచ్చి

వేశాను. నీకూ యిప్పుడదే గతి ప్రాప్తించబోతోంది" హెచ్చరించాడు.

అప్పటికీ ఏం మాట్లాడలేదు జయరాం. ఈ పరిస్థితి నుంచి యెలా బయటపడాలా అని తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

స్వామి కోపంతో నేల తన్నాడు. కాగడాలతో జయరాంమీదకొచ్చాడు. మరుక్షణం అతని రెండు కళ్ళను పొడిచేసి వుండేవాడు.

సరిగ్గా అప్పుడే గుండెలవిసిపోయేలా పెద్దపులి ఆర్తనాదం వినిపించింది. ఒకసారి కాదు, వరసగా చాలా సార్లు.

స్వామి చేస్తున్న పని ఆపేసి నిల్చుండిపోయాడు. ఎవరో పెద్దపులిని వేటాడుతున్నారు, అనుమానంలేదు. అర్ధరాత్రి సమయంలో అడవిలో యెవరు ప్రవేశించారు? శత్రువులా? అయితే ఎవరు?

స్వామి రెండు నిమిషాలు యేదో దీర్ఘాలోచనలో పడిపోయాడు. కాగడాలు కోయ నాయకులకు తిరిగిచ్చేశాడు.

"మీరిద్దరు వెళ్ళి అదేమిటో చూసి రండి! తక్కిన యిద్దరు యిక్కడే వుండండి!" అన్నాడు స్వామి. అతని మనసేదో కీడు శంకిస్తోంది.

నలుగురు కొండ నాయకుల్లో ఇద్దరు వెంటనే కాగడాలు చేత ధరించి బయలుదేరారు.

జయరాం కూడా స్పష్టంగా పులి గాండ్రింపులు విన్నాడు. ఎవరై వుంటారు? ఈ అర్ధరాత్రి పులిని వేటాడే వాళ్ళెవరుంటారు?

ఈ సందర్భంగానైనా తన మీద స్వామి దాడి

తాత్కాలికంగా ఆగిపోయింది. లేకంటే ఈపాటికి తన రెండు కళ్ళు పాడిచేసి తనని శాశ్వతంగా అంధుడిగా మార్చేసి వుండేవాడు.

ఇప్పుడైనా వసుల్తాడనే నమ్మకం లేదు. తన అంతం చూడకుండా విడిచిపెట్టడు. ఏం చెప్పి ఇతన్ని నమ్మించ గలడు?

జయరాం మనసునిండా కందిరీగల్లాంటి ఆలోచనలు ముసురుకుంటున్నాయి. ఓ పక్క దర్భాసనం పరచిన బండమీద కుమార్ గాఢ నిద్రలో వున్నాడు. ఆ పసి వాడి ముఖం చూస్తుంటే గుండె తరుక్కుపోతోంది జయరాంకి.

తన స్వార్థంకోసం కుర్రాడి జీవితాన్ని నాశనం చేశాడు తను. ప్రాణాలతో బయటపడటం జరిగే పనిలా అనిపించటంలేదు.

స్వామి తనకంకే సూటిగా చూస్తూన్నాడు.

తను యెలాగైనా ఒప్పుకుంటాడనే ధీమాతో వున్నా డతను. తను అంగీకరించకపోయినా, తనని చంపకుండా వదలడనదే నిర్వివాదాంశం! తను అతన్నుంచి, ఆ ఆటవిక నాయకుల బారినుంచి తప్పించుకుని యీ కీకారణ్యంలో పదిగజాలు కూడా వెళ్ళలేను.

పులిబోనులో తల పెట్టాడు. బయటపడటం మాత్రం కల్ల! తిరగబడితే....!? తనదగ్గిర యెలాంటి ఆయుధమూ లేదు. తిరగబడిన మరుక్షణం వాళ్ళు తనని నిర్దాక్షిణ్యంగా చంపేస్తారు.

ఎలా? ఎలా తప్పించుకోవటం?

జయరాం కళ్ళకి కోయ నాయకుల బరిసెలు కనిపి స్తున్నాయి. ఓ పక్కగా కొండగుహలో బండలను చేర్చి

నిలబెట్టి వున్నాయి. వాటిల్లో ఓ దాన్నందుకుని నిత్యానందస్వామిని ఒక్క సారిగా పొడిచిపారేస్తే....?! అనిపించిందో క్షణం.

కాని, ఆ మరుక్షణమే ఆటవికులు తనని ఏ కీలు కా కీలు విరిచేస్తారు. తనేం సాధించినట్టు?

నిత్యానందస్వామి అనిశ్చితంగా గుహలో పచార్లు చేస్తూ జయరాంవైపు సూటిగా చూసి "నీకిచ్చిన వ్యవధి అయిపోయింది. ఇంతకన్న ఓర్మి వహించలేను. ఏం నిర్ణయించుకున్నావు?" అన్నాడు.

జయరాం వెంటనే మాట్లాడలేదు.

నిత్యానందస్వామికి ఛర్రున కోపం వచ్చేసింది. ఓ బండమీద సిద్ధంగా వున్న వేటకత్తిని అందుకున్నాడు. విసురుగా జయరాంమీదికి లంఘించాడు. మరుక్షణం అతని తల ఎగిరి అవతల పడివుండేదే!

కాని, ఈలోపల ఊహించని అద్భుతం జరిగిపోయింది.

గుహ ముఖద్వారం దగ్గర కాగడాలతో కావలివున్న ఆటవిక నాయకులిద్దరు పెడబొబ్బలు పెట్టారు. ముందు వాళ్ళ ఆర్తనాదాలు, ఆ వెంటనే సింహగర్జన వినిపించాయి.

స్వామి తత్తరపాటుతో చూశాడు బయటికి. ఓ ఆటవిక నాయకుడు నేలమీద కూరిగిపోయాడు. వాడి చేతిలోని కాగడా యెగిరి అల్లంత దూరంలో పడింది. సింహం వాడి గుండెలు చీల్చేసింది. ఈలోపల రెండో నాయకుడు బరిసెతో సింహంమీదికి లంఘించాడు.

సింహం మహోగ్రంగా గర్జించి, రెండో నాయకుడి కంఠం కొరికేసింది. పెద్ద వెర్రికేక వేసి కాగడాను,

బరిసెను వదిలేసి నేలమీద నిలువునా పడిపోయాడు. సింహం అతన్ని నోట కరుచుకుని పొదల మధ్యకు చెంగున దూకి క్షణాల్లో మాయమైపోయింది.

నిత్యానందస్వామికి నోట మాట రాక అలాగే నిల్చుండిపోయాడు. అతని చేతిలోని కటకత్తి అంతకు ముందే నేల జారిపోయింది.

కాగడాలు ఎగిరి అవతలపడటంతో గుహలో వెలుతురు లేకుండా పోయింది. సరిగ్గా ఆ అవకాశాన్ని తనకు అనువుగా మలచుకున్నాడు జయరాం. మెదలకుండా కొడుకును లేవదీసి భుజాన వేసుకుని చప్పుడు కాకుండా బయటకు. పిల్లికన్నా మెత్తగా అడుగులు వేసుకుంటూ తప్పించుకుని పారిపోయాడు.

దూరంగా కాగడాల వెలుతురు కనిపించింది.

అంటే, పులిని వేటాడుతున్నవాళ్ళను చూడటానికి వెళ్ళిన యిద్దరు అనుచరులు తిరిగివస్తున్నారన్నమాట.

కాగడాల వెలుతురు బాగా దగ్గరయ్యింది.

గుబురుగా వున్న పొదల చాటుగా నక్కి కూచున్నాడు జయరాం.

ఆటవిక నాయకులు సరాసరి గుహలోపలికి వెళ్ళారు. చచ్చిన సహచరుల్ని చూశారు.

ఏదో అనబోతుండగా లోపల్నుంచి సిద్ధుడు గట్టిగా అరిచాడు.

“వాడు తప్పించుకుని పారిపోయాడు. మనవాళ్ళ నిద్దర్ని చంపేసి పారిపోయాడు. పిల్లగాడి నెత్తుకుని మరీ పోయాడు. వాడ్ని పట్టుకోండి. ప్రాణాలతో నయినా సరే, శవాలనయినా సరే—పట్టుకోండి, వెళ్ళండి!”

ఆటవిక నాయకులకి మరేమీ ఆలోచించాల్సిన అవ

సరం లేకపోయింది.

కొండదేవతకు మమ్మారు స్మరించుకుని, ఖాగడాలు ఓ చేత, బరిసెలు మరో చేత ధరించి పెద్దగా సింహ నాదాలు చేసి ఒక్కసారిగా అడవిలోకి పరుగులు తీశారు.

వాళ్ళు బాగా దూరంగా వెళ్ళిపోయేవరకు పొదల్లోనే తలదాచుకుని, తర్వాత పైకి లేచాడు జయరాం కుమార్ ని జాగ్రత్తగా భుజంమీదకు యెత్తుకుని పాడివి పట్టుకున్నాడు

కటిక చీకటి' పక్కన యేముందో యెదురుగా యేముందో కనిపించటంలేదు. అప్పటికి చీకటికి కళ్ళు అల వాటుపడ్డా స్పష్టంగా యేదీ కనిపించటంలేదు.

జయరాం మొండిధైర్యంతో ముందుకు పరుగుతీశాడు. అడుగుతీసి అడుగు వెయ్యటమే కష్టంగా వుంది. పరుగు పెట్టడం సాధ్యంకాదని రెండు నిమిషాల్లోనే అర్థమై పోయింది.

సరిగ్గా అప్పుడే పొదల్లో యేదో చప్పుడయ్యింది. ఏదో జంతువు మసలుతున్న సూచన! స్పష్టంగా విని పించింది జయరాంకి.

అతని గుండె ఒక్కక్షణం ఆగి మళ్ళీ కొట్టుకున్నది. సింహమా? పెద్దపులా? మరో క్రూరమయిన జంతువా? యే క్షణంలోనయినా తన మీదకు దాడి చేస్తుం దేమో....!?

ఇప్పు డెలా?

జయరాం కదలక మెదలక అలాగే నిల్చుండి పోయాడు. భుజంమీద కుమార్ కదులుతున్నాడు.

13

కొద్ది క్షణాల వరకు తమమీదికి దూకిన దేదో అర్థం కాలేదు కరుణాకర్, కేశవ్ లకు.

టార్చి దూరంగా పడిపోయినా వెలుతురు నేలమీద అటు యిటు ప్రసరిస్తూనే వుంది. కరుణాకర్ కన్న ముందే కేశవ్ ఆ ఆకారాన్ని గుర్తించాడు. మనిషిలాగే వుంటే చింపాంజీ యేమో? అనుకున్నాడు. కాని కాదని మరుక్షణమే నిర్ధారణయింది.

అది గొరిల్లా. మనిషిలాగే రెండు కాళ్ళ మీద నిల్చుని గంటల తరబడి పోరాడగల జంతువు కాని జంతువు!

పెద్దపులితో పోరాడి, గాయాలతో బాధపడుతుండగానే మళ్ళీ మరో జంతువుతో ఆ కీకారణ్యంలో, నడిరాత్రి, చిట్టచీకట్లో ప్రాణం రక్షించుకోవటం కోసం తెగించి పోరాడవలసిన దుర్గతి పట్టినందుకు వాళ్ళిద్దరు మనసుల్లో ఓ పక్క కుమిలిపోతూనే శత్రువుతో తలపడ్డారు.

గొరిల్లా పెద్దపులిలాంటి క్రూరజంతువు కాదన్నమాటే గాని, పోట్లాట మొదలెడితే ఓ పట్టాన వదలదు!

కరుణాకర్ గొరిల్లా పట్టు వదిలించుకోవటానికి కిందమీదవుతున్న సమయంలో కేశవ్ దాన్ని నడుముమీద, పక్కల్లోను కత్తితో బలంగా పొడిచాడు.

సరిగ్గా పట్టు దొరికివుంటే పళ్ళతో కరుణాకర్ గొంతు కొరికేసి వుండేది గొరిల్లా. కాని, కేశవ్ కత్తి పోట్లనుంచి తప్పించుకోవటం కోసం కరుణాకర్ ని వదిలేసింది. మహాకోపంతో ఘూర్ణిల్లుతూ కేశవ్ మీదికి ఉరికింది. చేతులు చాచి తన ఇనుపపంజాల్లో ఇరికించి నుగ్గు

చేసేద్దామన్నంత వేగంగా మీది మీదికొచ్చింది విక్రతంగా అరుస్తూ.

ఈసారి ఛాన్స్ కరుణాకర్ తీసుకున్నాడు. గొరిల్లా ఉరికినపుడు దూరంగాపడిపోయిన కత్తిని అందుకున్నాడు' టార్చిలైటును కూడా తీసుకున్నాడు. వెనకపాటున వెళ్ళి కత్తితో దాని కాళ్ళ మధ్యన చాచిన చేతులమీద బలంగా పొడిచాడు.

గొరిల్లా అమాంతం నేలమీద పడిపోయింది. కేశవ్, కరుణాకర్ అది చచ్చేవరకు కత్తులతో పొడుస్తూనే వున్నారు.

గొరిల్లా ఆఖరి శ్వాస వదిలేసింది.

అప్పటికి కరుణాకర్, కేశవ్ పూర్తిగా నీరసించిపోయారు. నేలమీద చతికిలబడిపోయారు ఆయాసంతో. గొరిల్లాతో పోరాటంలో కరుణాకర్ దుస్తులు చీలికలు పేలికలై పోవటమే కాక, శరీరంమీద చాలాచోట్ల గాయాలయినాయి.

దాహంతో యిద్దరి నోళ్ళు పిడచకట్టుకు పోయాయి. కరుణాకర్ అంత బాధలోను లేచి దూరంగా పడిపోయిన ఏర్ బ్యాగ్ నుంచి చెదిరిపడిపోయిన వాటర్ బ్యాగ్ ని వెతికి తెచ్చాడు. ఇద్దరూ ఆత్రంగా నీళ్ళు తాగారు.

కొంత శక్తి వచ్చినట్టుగా అనిపించింది.

కరుణాకర్ నోరు తెరిచి యేదో అనబోయాడు. కాని, అదే సమయానికి రెండు కాగడాలు వాళ్ళకి అతి సమీపంలో ఇటే వస్తూ కనిపించాయి.

ఇద్దరూ ఊపిరి కూడా విడువటం మానేసి అటే చూస్తూన్నారు.

అంతకంతకు ఆ కాగడాలు తమకి అతి సమీపంగా రావటం గమనించిన కేశవ్, "ఎవరో యిద్దరో అంతకన్న యెక్కువమంది వ్యక్తులు యిటే వస్తున్నారు. మనం సురక్షిత స్థానాన్ని వెతుక్కోవటం మంచిది....!" అన్నాడు.

కరుణాకర్ టార్చి ఆఫ్ చేసేశాడు.

"సురక్షిత స్థానమంటూ యేదీ లేదు. చెట్టెక్కటం తప్ప మరో మార్గం లేదు" అన్నాడు.

ఇద్దరూ, యిందాకా గొరిల్లా దూకిన చెట్టుమీదికి ఎగబాకారు.

సరిగ్గా అప్పుడే కాగడాలతో కోయ నాయకులు అక్కడికొచ్చారు. వాళ్ళు సిద్ధుడు పంపిన నలుగురు నాయకుల్లోని యిద్దరు!

సరిగ్గా కరుణాకర్, కేశవ్ లున్న చెట్టుకిందికే వచ్చారు. కాగడా వెలుగు ఆ చుట్టుపట్ల యిరవై ముప్పయి గజాలవరకు వున్న దృశ్యాల్ని స్పష్టంగా కనిపింపచేస్తున్నది.

ఆ వెలుగులో చచ్చిన గొరిల్లా కనిపిస్తోంది, చాలా భయంకరంగా రక్తపుమడుగులో.

అందులో ఒకడన్నాడు: "పులి జంపేసినట్టుందాది. మనం యిన్న గాండ్రింపు ఆ పులిదే. లగెత్తూ అయ్యోరికి చెప్పాల" అంటూ రెండోవాడితో పాటు మళ్ళీ వెనుదిరిగి వెళ్ళిపోవటానికి సిద్ధమయ్యాడు.

రెండోవాడు పులి అడుగుజాడల కోసమో ఎందుకో కాగడాతో నేలమీద కాసేపు వెతికాడు. తర్వాత తలూపి, "పా, పోదం" అన్నాడు.

ఇద్దరూ వెళ్ళిపోయేవరకు కరుణాకర్, కేశవ్ లు

ఊపిరి కూడా విడవకుండా అలాగే చూస్తున్నారు.

కరుణాకర్ కేశవ్ వైపు తిరిగి, "వాళ్ళ మాటల్ని బట్టి పులి గర్జన విని వచ్చినట్టుంది కదూ! అఘోరం అంటే ఆ నిత్యానందస్వామి కావచ్చు. పశుపతిగారు చెప్పాడు కదా సిద్ధుడ్ని ఆటవికులు సాములోరని, అఘోరనీ పిల్చుకుంటారని!" అన్నాడు.

కేశవ్, "అవును. మనం వాళ్ళిద్దర్ని ఫాలో అయి వస్తే సిద్ధుడి గుహకి సరాసరి వెళ్ళిపోవచ్చు. అన్నయ్యని కుమార్ని అక్కడే అట్టిపెట్టి వుంటాడు సిద్ధుడు. దిగుదామా?" అన్నాడు.

కరుణాకర్ తలూపాడు.

ఇద్దరూ చెట్టుదిగి, వేగంగా కాగడాల జాడనిబట్టి వాళ్ళను అనుసరించి వెళ్ళారు. దూరంగా కొండగుహాలు కన్నులపండువు చేస్తూ కనిపించాయి.

"అదిగో, కొండగుహాలు!" ఆనందంగా అరవబోయాడు కేశవ్.

కరుణాకర్ మృదువుగా అతని చేతిని నొక్కాడు, ఎక్సయిట్ కావద్దని.

కొండగుహ ముఖద్వారం దగ్గర పచ్చిపడున్న ఆటవికుడు వాళ్ళ దృష్టిలో పడ్డాడు. లోపల్నుంచి సిద్ధుడు అరుస్తూన్న మాటలు అతి స్పష్టంగా వినిపించాయి.

"........పిల్లగాడిని ఎత్తుకుని మరీ పారిపోయాడు. వాడ్ని పట్టుకోండి. ప్రాణాలతోనైనా సరే, శవాలైనాసరే—పట్టుకోండి, వెళ్ళండి!"

ఆ మాటలు వింటూనే ఆటవిక నాయకులిద్దరూ అతి వేగంగా బయటకు పరుగెత్తుకుని రావటం కనిపించింది.

కరుణాకర్, కేశవ్ ఆనందంతో ఒకరినొకరు కర

చాలనం చేసుకుని, ఆలింగనం చేసుకున్నారు. జయరాం, కుమార్‌తో బాటు తప్పించుకుని పారిపోయాడని అర్థమై పోయింది యిద్దరికీ. పులి, గొరిల్లాలవల్ల అయిన గాయాల బాధ చేత్తో తీసేసినట్టుగా ఫీలయ్యారిద్దరూ.

కాని, అంతలోనే ఆ ఆనందం ఎగిరిపోయింది. ఆటవికులు కాగడాలతో, బరిసెలతో అడవిలో పరుగులు పెడుతూ వెళ్తూన్నారు.

జయరాం అడవికి కొత్త. ఆటవికులు పుట్టి పెరిగింది అడవిలోనే. జయరాం ఎంతమాత్రం పరుగెత్తగలడు? వాళ్ళకి దొరక్కుండా ఎలా తప్పించుకోగలడు?

కరుణాకర్, కేశవ్ భుజం తట్టి, "జయరాంని వాళ్ళు పట్టేసుకోవటం ఖాయం! మనం వెంటనే అతనికి సాయంగా వెళ్ళాలి. ఈ ఆటవికుల్ని వెనకపాటున వీలైతే దాడి చేసి చంపెయ్యాలి. హారియప్....!" అన్నాడు.

ఇద్దరూ, ఆటవికుల కాగడాలని గుర్తుగా చేసుకుని వాళ్ళు పరుగెత్తిన దిశలో తాము కూడా పరుగు పెట్టారు.

అప్పుడు రాత్రి ఒంటిగంటన్నరయింది.

14

జయరాం ఊపిరి కూడా పీల్చడం మరచిపోయి, టెన్షన్‌తో అలాగే కొద్ది క్షణాలు నిల్చుండిపోయాడు.

కుమార్ నిద్ర లేచి కదుల్తున్నాడు. లేచి యేడుస్తాడేమో! అప్పుడు తన ఉనికి సిద్ధుడికి ఆటవికులకి తెలిసి పోవడమే కాక, పొదల్లోని జంతువు క్కూడా తెలిసి పోతుంది.

తనకి రక్షణ వుండదు!

జయరాం పాదల్లోకి కళ్ళు చిట్లించి చూశాడు. ఏదో జంతువు కదల్తూ వస్తూన్నది. దాని కళ్ళు చీకట్లో మిల మిల మెరుస్తున్నాయి.

జయరాం గుండె వేగం హెచ్చింది. క్రూరమృగాల్లాంటి మనుషుల్నుంచి రక్షించుకోవటంలో క్రూర మృగాల పాలిట చిక్కుకోక తప్పలేదు. తనకి ఈ క్షణంతో నూకలు చెల్లిపోయినట్టే!

ఆ జంతువు కదులుతున్న సూచనగా ఎండుటాకుల మీద చప్పుడు వినిపించింది. ఆ క్షణమో, మరుక్షణమో అది తనమీద దాడి చేస్తుంది.

ఇప్పుడు తనేం చెయ్యాలి? నిస్సహాయంగా ఆ జంతువుకి బలి కావల్సిందేనా? పోనీ, కాలు సాగించి పరుగు పెడితే.... అదింకా ప్రమాదమేమో!

జయరాం డైలమాలో పడ్డాడు కొద్దిక్షణాలు.

సరిగ్గా ఆ దేక్షణంలో ఆటవికులు పరుగుపెట్టిన దిశగా పరుగెడుతున్న యిద్దరు వ్యక్తులు కనిపించారు—జయరాంకి.

ఉలిక్కిపడి చూశాడు. తనకి బాగా పరిచయమయిన ఆకారాలు.

జయరాం ఆనందంతో పెద్దగా కేక పెట్టాలనుకున్నాడు. వాళ్ళు....కరుణాకర్, కేశవ్ యిక్కడికెలా వచ్చారు? తనని వెతుక్కుంటూ వచ్చారా?

జయరాంకి కొండంత ధైర్యం వచ్చింది. కేక పెట్టబోయేంతలో మెరుపులా మాయమైపోయారు వాళ్ళు. తను కేక పెట్టడం ప్రమాదకరం కూడా. నిద్రుడికి వినిపించే అవకాశముంది. అయినా తన పిలుపు కందేంత సమీపంలో లేరు వాళ్ళు.

చేతి కందినట్టే అంది చేజారిపోయిన అవకాశాన్ని తలుచుకుని కొద్దిక్షణాలు బాధపడ్డాడు జయరాం. అంత లోనే పొంచివున్న ప్రమాదం గుర్తొచ్చింది.

పొదలవైపు పరిశీలనగా చూశాడు.

చిత్రం! అక్కడ తానిదివరకు చూసిన జంతువు లేదు. ఎటో పోయినట్టుంది.

బలంగా ఊపిరి పీల్చి వదిలాడు జయరాం.

తన ఉనికి కేశవ్‌కి, కరుణాకర్‌కి యెలా తెలియ జేయటం? తనని వెతుక్కుంటూ వచ్చి ఆటవికుల చేతుల్లో చిక్కుకుపోయేలా వున్నారు.

వాళ్ళసలే కర్కశులు. తనమీది కోపంతో వాళ్ళని చంపేస్తారు. జాలి, దయ, కరుణ అన్న పదానికి అర్థం తెలియని అనాగరికులు. స్వామి చేతుల్లో కీలుబొమ్మలు. ఏం చేసినా చెయ్యగలరు. వాళ్ళ నాపగలిగే వాళ్ళు గాని, వాళ్ళనుంచి తప్పించుకోగలవాళ్ళు గాని యెవరూ లేరు.

కేశవ్, కరుణాకర్ పులి బోనులో తల పెట్టేశారు. వాళ్ళు తనని రక్షించటం మాట దేవుడెరుగు, తనిప్పుడు వాళ్ళనే రక్షించాల్సిన అవసర మేర్పడింది.

కుమార్ పూర్తిగా మెలకువలోకి వచ్చాడు. "డాడీ!" అంటూ నీరసంగా పిలిచాడు.

జయరాం వాడి వెన్ను నిమిరి, "నేనే బాబూ! భయంలేదు" అన్నాడు.

"చీకటిగా వుంది. భయమేస్తోంది డాడీ! మనింటికి వెళ్ళిపోదాం" కుమార్ మెల్లిగా అన్నాడు.

"వెళ్ళిపోతున్నాం బాబూ! భయపడకు. చీకటిగా వుందికదూ, దారి కనిపించటంలేదు. ఇంటికే వెళ్ళిపోదాం"

అన్నాడు జయరాం లాలనగా.

"అమ్మ కావాలి డాడీ! అమ్మని వెంటనే చూడాలి" అన్నాడు కుమార్ తండ్రి కంఠాన్ని గట్టిగా కావలించుకుని.

"వెళ్ళిపోతాంకదా. ఇంట్లో వుంది అమ్మ. త్వరలోనే అమ్మను చూపిస్తాను."

"డాడీ! ఆకలేస్తోంది."

గతుక్కుమన్నాడు జయరాం. రాత్రి తొమ్మిదిగంటల ప్రాంతంలో యేవో పళ్ళు పుట్ట తేసి యిచ్చాడు స్వామి తినమని. బంగారం భ్రాంతిలో వున్న తను ఆ పళ్ళు తినలేదు. కుమార్ ఒకటో అరో తిని, తినలేనని మానేశాడు. అన్నంతినే పిల్లడిని పళ్ళతో సరిపెట్టుకోమంటే ఎలా తట్టుకోగలడు?

"కాస్సేపట్లో యింటికి వెళ్ళిపోతాం కదమ్మా! ఇంట్లో అమ్మ నీకోసం పెరుగుబువ్వ దాచిపెట్టింది, పోయి తిందాం. సరేనా?"

కుమార్ నీరసంగా తలూపాడు. చీకట్లో జయరాంకి కనిపించలేదు. "ఏం బాబూ, సరేనా?" అన్నాడు.

"ఊఁ!" అంటూ తండ్రి కంఠాన్ని కరచుకుని అలాగే మళ్ళీ నిద్రలోకి జారిపోయాడు కుమార్.

జయరాం ముందుకి దృష్టి సారించాడు. దూరంగా కాగడాలు కనిపిస్తున్నాయి. టార్చి వెలుతురు వుండి వుండి కనిపిస్తోంది.

బహుశా కరుణాకర్, కేశవ్‌లు అయివుండాలి! వాళ్ళు అటవికుల్ని వెన్నంటి యెందుకు అనుసరిస్తున్నారు? తన ఉనికి తెలుసుకోటానికా? వాళ్ళవెంట వస్తే తిక్క

డున్నదీ తెలుస్తూందనుకుని, ఎదురుగా వున్న కొండ గుహను గమనించకుండా ముందుకే పరుగెత్తుకుపోయారు.

జయరాం ఆలోచనలు తెగ్గొడుతూ వేటకుక్కల గుంపు అటే పరుగెడుతూ వస్తున్న జాడ పొడకట్టింది. అవి వేటకుక్కలేనా? అర్ధరాత్రి సమయంలో వేటాడే వాళ్ళెవరు?

కళ్ళు చిట్లించి చూశాడు. వేటకుక్కలు కాదు.

తోడేళ్ళ గుంపు!

జయరాం గుండెలు అవిసిపోయాయి. గుంపుగా వచ్చే తోడేళ్ళు చాలా ప్రమాదకరమని అతను విని వున్నాడు. సింహం, పెద్దపులివంటి క్రూరమృగాలకన్న గుంపుగా వుండే తోడేళ్ళు చాలా బలంగా పోరాడతాయని, ఎంత బలమయిన శత్రువునైనా చీల్చి చెండాడుతాయని విన్నాడు.

తను తప్పించుకునే దారి కనిపించటంలేదు. అవి మరింతగా ముందుకు దూసుకొస్తున్నాయి.

జయరాం కొద్దిక్షణాలవరకు ఏం చెయ్యాలో తోచక నిశ్చేష్టుడై నిల్చుండిపోయాడు.

15

"వాళ్ళు పక్కకి తిరుగుతున్నారు. జాగ్రత్త! టార్చ్ ఫోకస్ వాళ్ళకు కనపడనివ్వకండి!" హెచ్చరించాడు కేశవ్ కుమార్‌ని.

ఆటవిక నాయకులిద్దరూ అడవిలో అణువణువునా గాలింపు చేస్తున్నారు.

జయరాం అప్పటికే యెంతో దూరం పోయి వుండడని వాళ్ళ ధీమా! తమ సహచరుణ్ణి దారుణంగా చంపేసినందుకు కాదు వాళ్ళ కోపం. తమ సాములోరి నుంచి

తప్పించుకుపోయినందుకు ఆయన కోరిక నెరవేరకుండా చేసినందుకు క్రోధంతో వెతుకుతున్నారు. కనకదత్తుగణం బరిసెలతో తండ్రీ కొడుకు లిద్దర్నీ పాడిచెయ్యాలని మహోద్రేకంగా వున్నారు.

"మా అన్నయ్య మరో దారిన అడవినుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారేమో! వీళ్ళు వుడ్డిగా ఇద్దరు ఒక్కే దిశలో వెతకటానికి బయల్దేరారు. వీళ్ళకి భుజబలమే గాని బుద్ధిబలం నాస్తి. మనం రెండో డైరెక్షన్‌లో వెతుకుతూ పోదామా?" అన్నాడు కేశవ్.

కరుణాకర్ తల అడ్డంగా తిప్పి, "వీళ్ళిప్పుడు వెతుకుతున్నది మనం వచ్చిన దిశలోనే కదా! అంటే, బయటకు తప్పించుకునే దారి అదే కాబట్టి ఆ దిశలోనే వెతుకుతున్నారు. మన మనుకుంటున్నంత తెలివితక్కువ వాళ్ళేంకాదు వీళ్ళు" అన్నాడు.

కేశవ్ అవునన్నట్టుగా తలూపి, "అయితే వీళ్ళని వెంటనంటి తిరగడమే మంచిదేమో? అన్నయ్య పొరపాటున వీళ్ళకు దొరికిపోతే, మనం ఆదుకోవటానికవకాశముంటుంది" అన్నాడు.

"అందుకే నేను వీళ్ళని దృష్టిలో నుంచి దాటిపోనివ్వకుండా వెంటాడుతున్నది!"

"మరి యింకా ఆటవికులెవరైనా అన్నయ్యకోసం వెతుకుతున్నారేమో.... సిద్ధుడు కోయివాళ్ళనందర్నీ తన అధీనంలోనే వుంచుకున్నాడని, వాళ్ళకి అతని మాట వేదవాక్కనీ పశుపతి చెప్పారుకదా! ఆటవికులందరు తల్చుకుంటే అన్నయ్యని పట్టుకోవటం ఏమంత కష్టం?!"

"ప్రస్తుతానికి యీ ఆటవికులిద్దరే కదా వెతుకుతున్నారు....!? నా ఊహే నిజమైతే కొండగుహాలో

సెదుకు తప్ప వేరెవరూ లేరని చెప్పగలను, గుహ దగ్గర ఒక కోయవాడు చచ్చిపడున్నాడు కదా! ....జయరాం వాడ్ని చంపి వుంటాడని నేననుకోవటంలేదు."

"ఎలా చెప్పగలరు? బంధించి కొడితే పిల్లి కూడా యెదురుతిరుగుతుందని మీరు వినలేదా? ప్రాణానికి ప్రమాదమెదురయితే అన్నయ్య కూడా ఎదురుతిరిగి వాళ్ళతో కొట్లాటకు దిగివుండొచ్చు."

"అలా జరగటానికవకాశముంది. ఈపాటికి వీళ్ళకు దొరక్కుండా జయరాం తప్పించుకుపోయి వుంటే చాలా అదృష్టవంతులం. మనం తెల్లారేవరకు యెక్కడో గడిపేసి మెల్లగా అడవినుంచి బయటపడొచ్చు."

"తప్పించుకు పోవాలనే కోరుకుందాం. అరె పక్కకి తొలగు. ఏవో జంతువులు యిటే పరుగెడుతూ వస్తూన్నాయి"....అని కరుణాకర్ అంటుండగానే తోడేళ్ళ గుంపు వాళ్ళ ముందునుంచి వేగంగా పరుగెడుతూ వెళ్ళిపోయాయి. వాటి దృష్టిలో పడకుండా వాళ్ళిద్దరు బాగా గుబురుగా వున్న పొదల వెనక దాక్కున్నారు.

"ఇవి తోడేళ్ళు. మనుషుల్ని చీల్చుకు తినేస్తాయి. అడవిలో నివసించే తోడేళ్ళు జంతువుల్ని వేటాడటంలో నేర్పరులు. ఒక్కోసారి సమీప పల్లెలమీద దాడిచేసి మేకల్ని, గొర్రెల్ని ఎత్తుకుపోతుంటాయికూడా!" అన్నాడు కరుణాకర్.

"అటు చూడు, కాగడాలు సరాసరి మనవైపే వస్తున్నాయి. వాళ్ళిద్దరు యిటే వస్తున్నారు. మన మీదినుంచే వెళ్తారు. వాటికి చాలా సమీపంలో వున్నాం మనం!" అన్నాడు కేశవ్.

ఆటవికులు పరుగులాంటి నడకతో వస్తున్నారు.

బరిసెల్ని పొదల్లో గుచ్చి చూస్తున్నారు. వాళ్ళ ఉద్దేశం పొదల్లో జుతురాం దాక్కొనివుంటే బరిసె పోట్లకు కేకలు పెడతాడు కదా, అని!

"మనం పొదల్లో దాక్కోవటం ప్రమాదం. వాళ్ళు పొదల్ని పొడుస్తున్నారు" అన్నాడు కేశవ్.

"మనకలవాటుపడ్డ విద్య నుపయోగించడమే! పద, ఈ చెట్టెక్కుదాం" అన్నాడు కరుణాకర్.

ఇద్దరు చెట్టెక్కి గుబురుగా వున్న కొమ్మలమధ్య దాక్కొంటున్న సమయానికి ఆటవికులిద్దరు చెట్టుకింద కొచ్చేశారు సరిగ్గా అంతక్రితం వాళ్ళిద్దరు దాక్కొన్న గుబురు పొదను నాలుగుసార్లు బరిసెతో పొడిచి, అక్క డెవరూ దాక్కొనిలేరని నిర్ధారణ చేసుకుని అక్క డ్నుంచి ముందుకి కదిలారు.

సరిగ్గా అప్పుడే చిన్న పొరపాటు జరిగిపోయింది. కేశవ్ కూచున్న కొమ్మమీదికి రెండు ఎర్ర తేళ్ళు పాక్కుంటూ వచ్చాయి. చీకట్లో వాటిని వెంటనే గు ర్తించలేకపోయాడు కేశవ్. మణికట్టు దగ్గర చురు క్కున తేలుకొండీ గుచ్చుకోగానే అప్రయత్నంగా 'అబ్బా!' అన్న బాధాకరమైన శబ్దం బయటికొచ్చింది.

అంతే! వెళ్ళిపోతున్న ఆటవిక నాయకులిద్దరు ఒక్క సారిగా చెట్టుకిందికొచ్చేశారు. కాగడా వెలుతురు చెట్టు మీదికి బాగా కనిపించేలాగా యెత్తుగా పట్టుకుని చూశాడు పైకి.

గుబురు మధ్య ఎవరో వున్నట్టు గుర్తు పట్టేశారు. "ఆ, దొరికిండు పోడు, ఆడే దిగుతాడు" అన్నాడొక ఆటవికుడు.

కరుణాకర్, కేశవ్ నిర్ఘాంతపోయారు. తేలువిషం

రక్తంలో చేరి విపరీతమైన బాధగా వుంది కేశవ్ కి. దాని కన్న జరిగిన పొరపాటుకి తామిద్దరకే ప్రాణంమీది కొచ్చింది. ఆటవికులు తామిద్దర్నీ చంపి పారేయటం ఖాయం!

“దిగుదావా, పొడవమంటావా?” కిందినుంచి అరిచారు ఆటవికులు. వాళ్ళు పైనున్నది జయరాం అనే అనుకొంటున్నారు.

కరుణాకర్ మెల్లగా చెప్పాడు. “దిగిపోవటంకన్న గత్యంతరంలేదు. వాళ్ళు మనం జయరాం కాదని తెలిసి వదిలేస్తే సరే, లేకుంటే తప్పించుకునే మార్గం అప్పుడు ఆలోచిద్దాం.”

ఇద్దరు చెట్టు దిగారు.

ఆటవిక నాయకులు వాళ్ళిద్దర్నీ చూడగానే ఆశ్చర్యపోయారు. “ఎవరహె మీ పొరగాల్లిద్దరు యీడకెందుకొచ్చిన్రు?” అన్నాడొక ఆటవికుడు.

కరుణాకర్ ధైర్యం చేసి, “మేము ఉద్యోగస్థులం. ఫారెస్టు ఆఫీసుకి పనిమీద వచ్చి, అడవి చూదామని బయల్దేరి అడవిలో తిరుగుతూ వెనక్కి వెళ్ళటానికి దారి మరచిపోయాం. తెల్లారేవరకు యిక్కడ గడిపేసి అప్పుడు ఫారెస్టాఫీసుకి వెళ్ళిపోదామనుకుని చెట్టుమీద కూచున్నాం....” అంటూ యింకా యేదో చెప్తుండగానే —వాళ్ళిద్దరు ఒకరికొకరు సైగ చేసుకుని “అదంతా మా సాములోరు నూసుకొంట్రు, మా వెనకబడి రండహె!” అన్నాడొక ఆటవికుడు.

కరుణాకర్, కేశవ్ —వాళ్ళని నమ్మించటం కష్టమని, వాళ్ళకనుమానం పెరిగితే, నిలువునా నరికేస్తారని మనసులోనే ఓ నిర్ణయానికొచ్చి వాళ్ళవంక చూసి, “సరే,

వస్తాం, పదండి! మేము మీ శత్రువులం కాదు, మిత్రులమే. మమ్మల్ని ఫారెస్టాఫీసుకి తీసుకెళ్తే మీకే నిజం తెలుస్తుంది!" అన్నాడు కరుణాకర్.

ముందొక ఆటవిక నాయకుడు నడుస్తూండగా, కరుణాకర్, కేశవ్‌లు మధ్య, చివర రెండో ఆటవికుడు సిద్ధుడి గుహ వైపుగా సాగిపోయారు.

కరుణాకర్, కేశవ్ పరిసరాలు జాగ్రత్తగా గమనిస్తున్నారు జయరాం జాడ తెలుస్తుందేమోనని!

16

తోడేళ్ళ గుంపు దగ్గిర పడుతుండగానే జయరాం మనసులోనే ఓ నిర్ణయానికొచ్చేశాడు.

చెట్టు దేనిమీదైనా ఎక్కి ఆత్మరక్షణ చేసుకోవాలనుకున్నాడు మొదట. కాని, చెట్టెక్కటం తనకి చేతకాదు. ఈలోపల తోడేళ్ళు తనని పసిగట్టి కండ కండలుగా చీల్చేస్తాయి. అందుకే సమీపంలో వున్న గుబురు పొదరిళ్ళ మధ్య దాక్కున్నాడు. ఊపిరి బిగబట్టాడు.

తోడేళ్ళ గుంపు అతను దాక్కున్న పొద పక్కనుంచే వెళ్ళిపోయాయి. అవి తనని పసిగడితే విందారగిస్తాయని అతనికి తెలుసు. టెన్షన్‌తో గుండె దడదడ కొట్టుకుంటుండగా, కుమార్ని భుజంమీద కదలకుండా పట్టుకుని అలాగే కూచుని చూస్తున్నాడు.

తోడేళ్ళు వెళ్ళిపోగానే లేచి నిల్చోబోయాడు సరిగ్గా అప్పుడే అవి మళ్ళీ వెనక్కి పరుగెత్తుకొని రావటం కనిపించింది.

అవి తనని పసిగట్టాయా? మనిషి జాడని అవి తేలిగ్గా గుర్తుపడతాయంటారు. తన జాడ పసిగట్టి, దాడిచెయ్య

టానికి వస్తూన్నాయా?

జయరాంకి గుండెలవిసిపోయాయి.

ఎటూ పారిపోవటాని కవకాశంలేదు. మళ్ళీ ఇందాకటి లాగానే ఒదిగి కూర్చొని, వాటి గమనాన్ని పరిశీలిస్తే సరి—అనుకుని పొదల చాటున ఊపిరి బిగబట్టి కూచున్నాడు.

తోడేళ్ళ గుంపు అతను కూచున్న పొదరింటి దగ్గరే ఆగింది సరిగ్గా.

జయరాంలో టెన్షన్ మరింత పెరిగిపోయింది. అయినా చలనం లేకుండా అలాగే కూచున్నాడు. మొండి ధైర్యం. తెగింపు చోటు చేసుకున్నాయతనిలో. దుష్టుడైన సిద్ధుడి చేతిలో నికృష్టంగా చచ్చేకన్నా జంతువులకి ఆహారమైపోవటమే మేలనిపించింది.

అయితే, తోడేళ్ళు ఈసారి మరో దిశలో సాగిపోయాయి. పొదరింటికి కుడివైపు నుంచి యెగుడు దిగుడుగా వున్న గుట్టలవైపు పరుగెత్తుకుంటూపోయాయి.

తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు జయరాం. తను అడవిలోకి ప్రవేశించిన దారి గుర్తు చేసుకోవాలని యెంతగా ప్రయత్నించినా గుర్తు రావటంలేదు. ముందు ఈ సిద్ధుడికి దూరంగా పారిపోతే తెల్లారేలోపల యెలాగో అడవినుంచి బయటపడక పోడు.

జయరాం పొదరిల్లు పక్కనుంచి బయటకు రాబోయి చటుక్కున ఆగిపోయాడు.

సరిగ్గా అప్పుడే కాగడాల వెలుగు మళ్ళీ తన వైపుగా సాగివస్తూ కనిపించింది. హతాశుడై పోయాడు జయరాం. ఎన్ని ఆటంకాలో! తనసలు ప్రాణాలతో తప్పించుకోగలడా?

అప్పుడు అకస్మాత్తుగా గుర్తొచ్చింది జయరాంకి. తను తనొక్కడి గురించీ ఆలోచిస్తూ, కరుణాకర్, కేశవ్‌ల విషయం పూర్తిగా మరచిపోయాడు.

వాళ్ళు తననే వెతుక్కుంటూ వచ్చివుంటారు. తను కనిపించక, ఇంకా అడవిలో వెతుకుతూ వుంటారు. వాళ్ళనెలాగైనా కల్సుకుని తన ఉనికి తెలియజేస్తే ముగ్గురు కలిసి యెలాగో ఇక్కడ్నుంచి తప్పించుకు పారిపోవచ్చు!

ఇంతకీ వాళ్ళేమయినట్టు?! ఏదైనా చిక్కుల్లో పడలేదు కదా! ఈ రాత్రి సమయంలో అలవాటులేని ఈ అడవి మధ్యలో తనకోసం వచ్చి ఏం అవస్థలు పడుతున్నారో!

అప్రయత్నంగా టైం చూసుకోబోయి, అంతలోనే చేతికి వాచీలేదని గుర్తొచ్చి ఆ ప్రయత్నం విరమించుకుని కాగడాల వెలుతురువైపే చూస్తున్నాడు.

నిలువెత్తు పెరిగిన ఆ పిచ్చిమొక్కలు, పొదలు తనని బయటకు కనిపించకుండా పూర్తిగా కప్పేస్తున్నాయి. అది కొంతవరకు నయమే!

కాగడాలు బాగా దగ్గరయ్యాయి. ఇద్దరు ఆటవిక నాయకుల్ని గుర్తుపట్టాడు జయరాం. వాళ్ళిద్దరి మధ్య నడుస్తున్న కేశవ్‌ని, కరుణాకర్‌ని చూసి త్రుళ్ళిపడ్డాడు.

ఏమిటి, వీళ్ళకి చిక్కిపోయారా తన వాళ్ళు? తను తప్పించుకుని గంటకూడా పూర్తికాలేదు, ఇంతలోనే తనవాళ్ళు వాళ్ళకి బందీలయిపోయారు. ఎంత పని జరిగిపోయింది?

జయరాం గుండెని ఎవరో యినప పిడికలితో నొక్కివేసినట్టు బాధతో విలవిలలాడాడు. వాళ్ళనెలా తప్పిం

చాలి? తను తప్పించుకుపోయిన ఉక్రోషంతో ఆ స్వామి వీళ్ళమీద పగతీర్చుకోడుకదా! అసలు వీళ్లెవరో ఆతనికెలా తెలుస్తుంది? వీళ్ళను హింసించి నిజం చెప్పిస్తాడా? ఏమో అంత ఘనుడే!

టెన్షన్‌తో, ఆపుకోలేని ఉద్విగ్నతతో స్నేహితుడ్ని చూస్తూ కర్తవ్యవిముఖుడిలా అలాగే కొద్దిసేపటి వరకు నిల్చుండిపోయాడు జయరాం.

17

"వీళ్ళెవరు?" హుంకరించాడు నిత్యానందస్వామి.

ఆటవిక నాయకులు చెప్పారు.

"వీళ్ళ సంగతి తర్వాత చూసుకోవచ్చును. వాడేడీ? దొరకలేదా?" ఆత్రుత, అసహనం నిండిన గొంతుతో అడిగాడు స్వామి.

"దొరకలేదయ్యా. ఈలోపట యీల్లు అపడితే తోల్కొచ్చినం..అదు మన్నం వొదిలి పోయేదయ్యారూ! నా గూడెపోళ్ళని నిద్దర్లేపి ఆడి కొతికిస్తాను" అన్నాడో నాయకుడు. రెండో నాయకుడు కూడా అలాగే చెప్పాడు.

"అయితే, ఆ పనేదో వెంటనే చెయ్యండి. వాడు అడవిదాటి బయటకు పోకూడదు. వాడు తప్పించుకుపోయాడంటే మన సంగతంతా లోకానికి చాటేస్తాడు. ఆ తర్వాత మనం తలపెట్టిన మహాయజ్ఞం మూలపడిపోతుంది. మనకు దక్కాల్సిన నిధి చేజేతులా వదిలేసుకోవలసి వస్తుంది" స్వామి ఆవేశంలో తమ రహస్యాన్ని వెల్లడించేస్తూన్న సంగతిని విస్మరించాడు.

కరుణాకర్, కేశవ్‌లకి నిత్యానందస్వామి యేం కోరి ఈ నరబలులు—అందునా పదేళ్ళలోపు మగపిల్లలు—

నిర్వహిస్తున్నాడో అర్థమయిపోయింది.

ఆటవికనాయకుడిద్దరు పరుగులాంటి నడకతో బయటకి వెళ్ళిపోయారు.

నిత్యానందస్వామి కరుణాకర్, కేశవ్‌లను సమీపించి, "మీరెవర్రా? ఈ అడవిలో ఈ సమయంలో ఏం చేస్తున్నారు? నిజం చెప్పకపోతే మీ యిద్దర్ని యిక్కడే సమాధిచేసేస్తాను" అంటూ హుంకరించాడు.

కరుణాకర్ ఆటవికులకి చెప్పినట్టే స్వామికి చెప్పాడు.

స్వామి వికటంగా నవ్వి, "మీ కాకమ్మ కథలు నమ్మటానికి నేను అమాయకులైన కోయవాడ్ని కాదు. వాళ్ళు కూడా మీరు చెప్పేది నమ్మలేదు కాబట్టే నా దగ్గరకు మిమ్మల్ని తీసుకొచ్చారు. నిజం చెబుతారా సరే, లేకుంటే ఈ వేటకత్తితో ఒకేసారి మీ ఇద్దరి తలలు నరికి పారేస్తాను" అన్నాడు.

కరుణాకర్, కేశవ్ మాట్లాడలేదు. తామేం చెప్పినా అతను వినడని వాళ్ళకు తెలుసు. అతనొక్కడే వున్నాడు గుహలో. తామిద్దరున్నారు. అదృష్టవశాత్తు తమని ఆటవికులు బంధించకుండా మామూలుగానే వదిలేశారు. తప్పించుకు పారిపోవటం పెద్ద కష్టంకాదు.

ఎదురుగా నిత్యానందస్వామి చేత వేటకత్తి ధరించి క్రూరంగా వాళ్ళిద్దరివైపు నిప్పులు కురిపిస్తూ చూస్తున్నాడు. నిజంగానే నరికేసేలా వున్నాడు. జయరాం తప్పించుకు పారిపోయాడన్న కోపంతో తమమీద ప్రతీకారం తీర్చుకోబోతున్నట్టున్నాడు.

ఒక్కో అడుగు ముందుకు వేస్తూ వాళ్ళని సమీపిస్తున్నాడు స్వామి.

సరిగ్గా అదే సమయంలో మెరుపు వేగంతో నేలమీదికి వంగాడు కేశవ్. ఏం చెయ్యబోతున్నాడో స్వామి గ్రహించేలోపల యెగిరి అతని గుండెలమీద తన్నాడు.

స్వామి చేతిలోని కత్తి ఎగిరి అల్లంతదూరంలో పడిపోయింది. చాపచుట్టలా నేలమీద పడిపోయాడు స్వామి.

ఈలోపల కరుణాకర్ గుహలో వెలుగుతున్న కాగడాలని ధ్వంసం చేసేశాడు. క్రిందపడ్డ వేట కత్తిని కేశవ్ చేజిక్కించుకున్నాడు. లేవబోతున్న స్వామి కాళ్ళమీద అడ్డంగా కత్తితో నరికాడు.

స్వామి కాళ్ళు తెగిపోయి, పెద్దగా పెడబొబ్బ పెట్టాడు. నిశ్శబ్ద వాతావరణంలో ఆ కేక గుహలోను, అడవిలోను ప్రతిధ్వనించింది.

స్వామి గిలగిల కొట్టుకుంటూనే చేతిని చాచి, గోడకి చేర్చి వున్న బరిసెనందుకోబోయాడు.

ఈసారి స్వామి కుడిచేతిని నరికేశాడు కేశవ్. స్వామి మరోసారి ఆర్తనాదం చేశాడు.

కేశవ్ మరోసారి కత్తి నెత్తాడు. కాని అంతలోనే పెద్దగా అరచుకుంటూ దాదాపు ఏభై అరవైమంది ఆటవికులు గుహలోపలకు చొచ్చుకొని వచ్చేశారు. వారి వెంట యిందాకటి ఆటవిక నాయకులిద్దరు వున్నారు.

వాళ్ళందర్నీ ఒక్కసారిగా చూడగానే కేశవ్, కరుణాకర్ లు నిర్ఘాంతపోయి, చేష్టలుడిగి అలాగే నిల్చుండిపోయారు.

18

జయరాం ఇంకా ఆలోచనల్నుంచి తేరుకోకముందే ఆటవిక నాయకులిద్దరు అడవిలోనికి పరుగుతీయటం కని

పించింది. వెళ్ళినంత వేగం గాను వాళ్ళు సిద్ధుడి దగ్గర్నుంచి మళ్ళీ బయటకు పరుగెత్తుకొచ్చారు.

అంటే కేశవ్, కరుణాకర్ గుహలోపలే వుండి పోయారు. వాళ్ళని స్వామి ప్రాణాలతో వదుల్తాడా? ఆటవికులు మళ్ళీ యెందుకు పరుగెత్తారు? తనని వెతుక్కుంటూ వెళ్తున్నారా?

దృఢనిశ్చయంతో గుహవైపు అడుగులు వేశాడు జయరాం. అయితే అంతలోనే, వెనుక నుంచి యెవరో పరుగెత్తుకొస్తున్న సవ్వడి వినిపించింది.

చటుక్కున ఓ పెద్ద చెట్టు మొదలు వెనక దాక్కున్నాడు జయరాం.

ఒక్కసారిగా ఏభై అరవైమంది ఆటవికులు కొండ గుహవైపు పరుగెత్తుకొస్తున్నారు. వారిలో ఆటవిక నాయకులిద్దరు వున్నారు.

ఆశ్చర్యంతో, టెన్షన్‌తో అలే చూస్తున్నాడు జయరాం—

అప్పటికే నిత్యానందస్వామి చివరి దశలో వున్నాడు. విపరీతంగా రక్తస్రావం జరగటంతో సొమ్మసిల్లి పోయాడు. 'వాహం' అంటూ సైగ చేశాడు.

ఆటవిక నాయకులతోబాటు, ఆటవికులందరు మహోగ్రంగా చూస్తున్నారు కరుణాకర్, కేశవ్ లవంక.

ఓ ఆటవిక నాయకుడు మంచినీళ్ళు పోశాడు స్వామి గొంతుకలో. అయితే గుటకపడలేదు. స్వామి కళ్ళు అలా తెరచుకునే వున్నాయి.

అతని ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసి పోయాయి.

ఆటవికులు పెద్దగా గగ్గోలుచేస్తూ అరిచారు. "మా

అయ్యోర్ని చంపినందుగ్గాను మీ యిద్దర్ని కొండదేవరకి బలేసేత్తాం ఒహో, గూడెపోల్లూ, ఈల్లిద్దర్ని తోల్కొని రండి!" అంటూ ఆటవిక నాయకులు కరుణాకర్, కేశవ్ లను బంధించమని తమవాళ్ళ నాజ్ఞాపించారు.

ఆ మరుక్షణమే వాళ్ళిద్దరి పెడరెక్కలు విరిచికట్టి కొండ గుహనుంచి బయటకు లాక్కొచ్చారు కోయి వాళ్ళు.

పెద్దగా కేకలువేస్తూ, వాళ్ళిద్దర్ని శాపనార్థాలు పెడుతూ కొండదేవర వున్న స్థలానికి లాక్కుపోతున్నారు కోయగూడెం వాళ్ళు.

ఇదంతా దూరంనించి గమనిస్తూన్న జయరాం గుండెలవిసిపోయాయి.

ఎంత పని జరిగిపోయింది! ఇప్పుడు వాళ్ళనుంచి తన వాళ్ళిద్దర్ని విడిపించటం జరిగే పనికాదు. ఇదివరకు సిద్ధు తనకు చూపించిన కొండదేవత విగ్రహానికి వీళ్ళిద్దర్ని బలిస్తారు కాబోలు! అందుకే ఆ వైపుగా తీసుకుపోతున్నారు.

తను ఎలాగైనా వాళ్ళిద్దర్ని రక్షించుకోవాలి! అవును. వాళ్ళని బలిపెట్టకూడదు.

బలి తంతు దాదాపు గంట గంటన్నర సాగుతుంది. ముందు వీళ్ళని కొలనులో స్నానాలు చేయిస్తారు. తర్వాత నారచీరలతో అలంకరిస్తారు. అప్పుడుగాని బలితంతుకు పూనుకోరు. ఈలోపల తను చెయ్యవలసిన పని చాలా వుంది.

జయరాంలో కొత్త ఉత్సాహం వచ్చింది.

ఆటవికులు బాగా దూరమయిపోయాక, ఒక్కసారిగా

బయటికొచ్చి పరుగందుకున్నాడు.

భుజమ్మీద కుమార్ ఎగిరెగిరి పడుతున్నాడు. కాళ్ళకి రాళ్ళు రప్పలు, ముళ్ళకంపలు గుచ్చుకుని చర్మం లేచిపోయి రక్తం వరదలై కారుతున్నా ఆయాసంతో ఒగర్పు వస్తున్నా యేమీ లెక్క చేయకుండా యేటవాలు గుట్టను చేరుకున్నాడు.

గుట్ట ఎక్కి దిగితే ఫారెస్టు క్వార్టర్సున్నాయి. వాళ్ళ సహాయం తీసుకోవాలి. జరగబోతున్న బలుల్ని ఆపి వెయ్యాలి తనకోసం ప్రాణాల్ని లెక్క చెయ్యకుండా అడవిలో ప్రవేశించి ప్రాణాపాయస్థితిలో వున్న తన వాళ్ళని రక్షించుకోవాలి!

జయరాంలో ఒకే దృఢనిశ్చయం! అప్పటికే బాగా అలసిపోయాడు. ఒళ్ళంతా చెమట్లతో స్నానం చేసినట్టుగా తడిసిపోయింది. దాహంతో నాలుక పిడచకట్టుకుపోతోంది. అలాగే గుట్ట యెక్కుతున్నాడు జయరాం.

అప్పుడు తెల్లవారుఝాము నాలుగు గంటలయింది.

19

"ఏమిటి మీరంటున్నది? ఈ అడవిలో నరబలులా? ఉత్తది. మేం నమ్మం" అన్నాడు ఫారెస్టాఫీసరు.

"నన్ను నమ్మండి సార్! ఇదుగో నా కొడుకుని బలివ్వబోతే నేను రక్షించుకుని తెచ్చుకుంటున్నాను. నన్నూ, బాలుని రక్షించటానికి వచ్చిన నావాళ్ళిద్దర్ని పట్టుకుని బలిచ్చేస్తున్నారు. కావాలంటే మీ వెంట నేను వస్తాను. చూపిస్తాను. దయచేసి ఈ బలుల్ని ఆపండి!" వేడుకున్నాడు జయరాం.

ఫారెస్టాఫీసరుకి తెలుసు. పదేళ్ళలోపు పిల్లలు ఎందుకు అంతర్థానమవుతున్నారో.... సిద్ధు ఎక్కడుంటాడో, వాడు చేస్తున్న తంతు యేమిటో అన్నీ తెలుసు.

కాని కోయగూడెంవాళ్ళు మూర్ఖులు! వాళ్ళ స్వవిషయాల్లోకి తల దూర్చితే ఎంతటి వాళ్ళనయినా అంతం చేస్తారు. అది గతంలో తను ఎరిగిన సత్యం! అందుకే ఈ విషయంలో తలదూర్చగూడదని నిర్ణయించుకుని జయరాం మాటలకి అలా జవాబిచ్చాడు.

తాణేదారు, ఫారెస్టరు ముందుకొచ్చి, "సార్. పోనీ వెళ్ళిచూద్దాం. ఇన్నాళ్ళు రెడ్ హేండెడ్ గా వాళ్ళని పట్టుకోవటం వీలుకాలేదు. ఇప్పుడు వాళ్ళు బలివ్వగా చూస్తూ పట్టుకుంటే, ఇంతటితో వీళ్ళ రాక్షస కృత్యాలని అరికట్టిన వాళ్ళమవుతాం. లేకుంటే ఇలాంటి అవకాశం మళ్ళీ ఎన్నడూ రాదు" అన్నాడు ఫారెస్టాఫీసర్ తో రహస్యంగా.

అసలు సంగతేమిటంటే వాళ్ళిద్దరికి ఒక్కొక్క కొడుకు వున్నారు. వయసు ఒకడికి తొమ్మిదేళ్ళు మరొకడికి ఎనిమిదేళ్ళు. సిద్ధుడి కళ్ళు తమ పిల్లలమీద పడకముందే వాడి ఆట కట్టించటానికి మంచి అవకాశం కోరికింది. సిద్ధుడు అప్పటికే చచ్చిపోయాడని జయరాంకి తెలియకపోవటంవల్ల, ఆ విషయం చెప్పలేదు.

మరో పదినిమిషాల్లో ఫారెస్టాఫీసరు, తాణేదారు, గార్డు, అటెండర్స్, మరో పదిమంది సిబ్బంది పూర్తి సాయుధులై కొండగుహలవైపు బయల్దేరారు.

జయరాం, కుమార్ ని ఫారెస్టాఫీసరు యింట్లో ఆడవాళ్ళ కప్పగించి వాళ్ళతో బయల్దేరాడు.

20

వాళ్ళు వెళ్ళేసరికి బలితంతు ప్రారంభమయ్యింది.

అప్పటికే కేశవ్‌ని, కరుణాకర్‌ని స్నానమాడించి నారదుస్తులు ధరింపచేశారు. వాళ్ళిద్దరి ముఖాలకి సింధూరపు బొట్లు పెట్టారు. మెళ్ళో కాయలు, పూలతో చేసిన దండల్ని వేశారు.

బలివ్వటానికి యిక కొద్ది నిమిషాలు మాత్రమే కాల వ్యవధి వున్నది.

ఫారెస్టాఫీసరు చప్పుడు చెయ్యకుండా తన వాళ్ళని ఆ కొండదేవత విగ్రహం చుట్టూ ఎవరికీ కనిపించకుండా వలయాకారంగా అమర్చాడు. ఒక వేళ ఆటవికులు ఎదురు తిరిగినా అక్కడికక్కడే కాల్చివేయటానికి రంగం సిద్ధం చేశాడు.

ఆటవికులు బాగా సురాపానంచేసి వున్నారేమో మహానందంగా నాట్యం చేస్తున్నారు — తప్పెటలు ప్రళయ ఝంఝూమారుతాన్ని సృష్టిస్తూ కర్ణకఠోరంగా మోగుతున్నాయి.

కరుణాకర్, కేశవ్‌లలో ప్రేతకళ వచ్చేసింది. ఇక తమకు అంతిమ ఘడియలు సమీపించాయని నిర్ధారణ చేసుకున్నారు.

తప్పెటల వేగం హెచ్చింది.

ఆటవిక నాయకులిద్దరి చేతుల్లోను పదునైన వేట కత్తులు కాగడాల వెలుగులో మెరుస్తున్నాయి.

అప్పుడు ఉదయం అయిదు గంటలు కావస్తోంది.

తెల్లవారబోతోంది.

వేటకత్తులు గాల్లోకి లేచాయి కరుణాకర్, కేశవ్‌ల

వత్తుకలు నరకటానికి.

సరిగ్గా అదే సమయంలో గాల్లో తుపాకులు పేల్చిన శబ్దం వినిపించింది.

ఒక్కసారిగా కోలాహలం ఆగిపోయింది.

ఆటవికులు దిగ్భ్రమ చెంది చూస్తున్నారు.

ఫారెస్టాఫీసర్‌తో పాటు, పదిహేనుమంది తమని తుపాకులతో చుట్టుముట్టినట్టు వాళ్ళు గ్రహించారు.

ఫారెస్టాఫీసరు గట్టిగా అరచి ఇలా చెప్పాడు! "ఈ బలికార్యక్రమం మా కళ్ళారా చూశాం. ఇందుకు కారకులైనవారిని మేము అంత తేలిగ్గా వదిలిపెట్టం. మాకు లా అండ్ ఆర్డరు పవర్సు—అంటే, మీకు తెలియదు—మిమ్మల్ని బంధించటానికి సర్వహక్కులు వున్నాయి. పంతానికి పోయి, తిరగబడాలని ప్రయత్నం చేస్తే నిర్దాక్షిణ్యంగా కాల్చిపారేస్తాం."

ఆటవికులు నిషా దిగిపోయి, తలలు వాల్చేశారు. ఒకరొకరుగా అందరూ ఓ పక్కగా వచ్చి నిల్చున్నారు.

ఆటవిక నాయకులు ముందుకొచ్చి, చేతులు చాపి, "మా వోళ్ళ నేం సెయ్యొద్దు. ఈ బలులు సేత్తున్నది మాం. మా పసుసుల్నేటి సెయ్యొద్దు. మాం వొత్తాం. తోల్కుపొండి" అన్నారు.

ఫారెస్టాఫీసరు అదే అధికార స్వరంతో, "ముందు మీరందరు మాకు లొంగిపొండి. తర్వాత మిమ్మల్ని వదిలేస్తాం. ఇందులో నిజమైన నేరస్థుల్నే మేం శిక్షిస్తాం. తక్కిన సంగతులు పరిష్కరించటానికి కోర్టుంది!" అన్నాడు.

నాయకులు అంగీకారసూచకంగా తలూపారు. వాళ్ళు లొంగిపోయారనే అందరు అనుకొంటున్న క్షణంలో

ఒక్కసారిగా వాళ్ళందరు తిరగబడ్డారు. బరిసెలతో వాళ్ళమీద దాడిచేశారు.

ఫారెస్టాఫీసరు నిర్ఘాంతపోయాడు. వాళ్ళు ఇంతగా తెగిస్తారని అతనుగాని, అతని సహచరులుగాని అనుకోలేదు.

"ఫైర్!" అంటూ అరిచాడు ఫారెస్టాఫీసరు.

పది పదిహేనుమంది ఆటవికులు నేలకూలారు. అటవీ సిబ్బంది నాలుగురైదుగురు గాయపడ్డారు బరిసెల పోట్లకు.

అయితే మరో పదినిముషాల్లో మరో పదిహేనుమంది ఆటవికులు నేలకూలిపోగానే, ఆటవిక నాయకులు లొంగిపోయారు.

బరిసెల్ని నేలమీద పారేసి మోకాళ్ళమీద వంగి తమ లొంగుబాటును సూచించారు.

ఫారెస్టాఫీసరు విజయగర్వంతో నవ్వాడు. తమ వెంట తెచ్చిన పెద్ద మోకుతో ఆటవికులందర్నీ బంధించమని ఆదేశించాడు.

తెల్ల తెల్లవారుతుండగా అందరు ఫారెస్టాఫీసుకు చేరుకున్నారు.

—: అయిపోయింది :—